ఆత్మార్పణ

(సాంఘికనవల.

గ్రంథకర్త:—

ఉభయభాషాప్రవీణ—

ఆకెళ్ళ గోపాలకృష్ణశర్మ

ప్రకాశకులు:—

కర్రా అచ్చయ్యా అండ్ సన్సు

ఈశ్వర బుక్ డిపో,

రాజమండ్రి.

[వెల రు 1—0—0

మొదటి కూర్పు.

ప్రభాసీ ప్రెస్,
రాజమండ్రి.

మనవి.

నేటి కాలమందాంధ్ర సారస్వత మభివృద్ధి చెందుచున [illegible] కాని, సారస్వతమునకుఁ బ్రయోజన భూతములగు నా ధర్మములు గానరావు. ఆదర్శసిద్ధికై పాటుబడుట రచయితల కర్తవ్యము. దేశము, సంఘము, నిర్జీవమై కర్తవ్యజ్ఞాన-విహీనమై-గతానుగతికమై-సంచరించుచున్నప్పుడు, వాఙ్మయము వలన నా దోషములనుఁ బారద్రోలి, దేశమును, సంఘమును, నుజ్వలవంతముగ నాదర్శప్రాయముగ నొనరింపవచ్చునని నా యాశయము.

వివాహమునకు ముఖ్యసూత్రము, పవిత్రప్రే[illegible] బరమావధి, ఉత్తమగృహిణికి నాదర్శము, నారీమణికిఁ బునర్వివాహాధికారము, మొదలగు మన హిందూసంఘ నియమములను నా గ్రంథ పఠనానంతరమైనను, బరిశీలించి, యందలి గుణదోషములను, ఆదర్శములను విమర్శించితిరేని నా యీ ప్రయత్నము సఫలమగునని సంతసించుచున్నాను.

నాశక్తిని గుర్తెఱుంగక బాల్యచాపల్యమున గ్రంథరచనకుఁ బూనికొని నందులకుఁ గొన్ని లోపములుండ వచ్చును. ప్రాజ్ఞులు మన్నించి, నాకుఁ బ్రోత్సాహ మొసంగుదురని నమ్ముచున్నాను.

ఇట్లు,

విధేయుఁడు,

గోపాలకృష్ణశర్మ.

విషయసూచిక

1. బాల్యక్రీడ.
2. వలపు.
3. సంసారనౌక.
4. ప్రవాసము.
5. విరహము.
6. దారిద్ర్యము.
7. పునర్వివాహము.
8. ఆగష్ట
9. ఆవేద
10. ఆత్మార్పణ.
11. పూర్వస్మృతి.
12. పరితాపము.
13. నిశ్చయము.
14. నిస్పృహ.
15. స్వస్తి.

శ్రీరస్తు.

ఆత్మార్పణ

బాల్యక్రీడ.

ఆ ప్రశాంత సాయంసమయమువలన, సుప్ర[illegible]మును, పావన గౌతమీసరిత్పతీ వీచికాకల రవమువలన, గలరవమ్మును, సౌరభ సంవాసిత మలయానిలునవల మందగమనమును నలవరించుకొని, గోదావరీ సైకతస్థలుల-విముక్తకంఠమున-తాలుకరంగునట్లుపాటలు-పాడుచు-గొంతసేపు-ఇతరేతర పరిహాసములం గొంతసేపు, ఇసుకగుంపోగు చేసి పిచ్చుకగూండ్లనుంగట్ట నయ్యవి కాలిపోంగా మఱల నూతనభవనములు నిర్మించుచుం గొంతకాలము-గోదావరీ వారిపూరముల దోసిలింతోం దెచ్చి యొకరిపైనొకరు సల్లికొనుచు మఱికొంతకాలము-ప్రపంచ-సౌఖ్యమును, భావిపరిస్థితులను భావింపక ఆనందస్వరూపముగుం బ్రకృతి సౌందర్యమున కచ్చెరువందుచు, నిరువురు బాలురు, నొకబాలికయు విలాసార్థము విహరించుచుండిరి. వారు ముగ్గురునుం గొంచె మించు మించుగా సమానవయస్కులే.

వారు ముగ్గురు బ్రతిదినమట్లే సాయంతనసమయమునకు గోదావరిచెంత కరుదెంచి హాయిగం గాలమును బుచ్చుచుండురు. ఆనాండేలకో గాని-యాబాలకు లిరువురు గలహింప జొచ్చిరి. ఈకలహము గృహసంబంధమైనది. వారుంగోదావరీతీరమందు గూరుచుండి "బొమ్మల పెండ్లిండ్లు" అనునాటనాడుకొనుచుండంగా 'గృహయజమాని యెవ్వఁడు'?

అని ప్రశ్నించుకొనిరి. "గృహయజమానిని నేను నేను" అనుచు నా యిరువురు దమ పంతముల విడువరైరి. పాప మాబాలిక యిరువురను వేర్వేర ప్రీతిమాలాడెను. తనమాటనాదరించినవారితోనే మాట్లాడుదు ననియు, నితరునితో నిదిమొదలు మాట్లాడననియుఁ బల్కినది. అయి నను లాభములేకపోయెను. ఇదివఱ కెన్నియోపర్యాయములు వారు కలహించుటయు, నా బాలిక యభిప్రాయముచొప్పున వర్తించుటయు నాచారము. కాని, యీసమయమునందుఁదనమాట నాదరింపకుండుటచే నామెకుఁగూడఁ గోపముగల్గెను. కోపమున నామెతనయింటికిఁ బోవుదు నని లేచెను. [illegible]రు నామె నాఁపుచేసిరి. ఆమె వారిమాటను బెడ చెవినిబెట్టి పోఁబో[illegible] నీమాటనే యంగీకరింతుమని బాసచేసిరి. ఆమె యప్పుడు కూర్చుండి నీవు ప్రథమమున యజమానివి. నేనుయజమాను రాలను. తరువాత నీవుయజమానుఁడవు. యజమానురాలనుమాత్రము నేను, అని యిరువురను సంతోషపెట్టులకై పల్కినది. మొదటివాని కా పలుకు ములుకువలె మనమున నాటినది. రెండవవానికిఁ గూడ హృదయశల్యమయ్యెను. కాని, తమ బాసప్రకారము బూర్వస్నేహమున నుండిరి.

మొదటవాని మనసుమాత్ర మప్పటినుండియు నాందోళిత మయ్యెను. ఆమె నోటినుండి వెలువడినమాటను వినినప్పటినుండియు హృదయభార మతిశయిల్లెను. భావిజీవితమందు రాఁబోవు పరిస్థితుల నూహించికాని, సుదృఢముగ నిర్మించుకొనిన యూహాసౌధములు మొదలంట నేలఁగూలినవి. 'ఆ బాలికప్రేమ శాశ్వతమా? బుద్బుద ప్రాయమా? ఆమెను ప్రేమభిక్షకై యర్థించియామె యంగీకారమునకై నెదురుచూచు నాకా మాటలు హృదయశల్యము లాయెనే' యని తలంచుచు గృహమునకుఁ బోయెను. రెండవవాడు నావృత్తాంతము స్మరింపకయే గృహోన్ముఖుఁడాయెను. బాలికకుమాత్ర మా మాటవలన

నేమియు నంతస్తాప ముదయింపలేదు. వారి కలహమును నిర్మూలించుటకై యట్లుపలికెనే కాని, యామెహృదయమునం దేవిధమగు సంకోచముగాని,సంతోషముగాని, సంతాపముగాని లేదు. ఆమెయుఁ దనభవనమున కరిగెను.

అవ్యాజానురాగము, నిష్కళంక హృదయము గల స్నేహితుల మనసులందుఁ బెనుతుఫాను బయలుదేఱెను. హృదయావేదనను, గప్పిపుచ్చి మనసునందలి భావపుంజమును మఱుఁగుపెట్టి, తమపూర్వస్నేహముతోడనే మసలుచుండిరి. ఒకదినము గోదావరీతీరమునకు, మఱియొకదినము, ఆగ్రామప్రాంతములకును విహారార్థ మేఁగుచుండిరి. హృదయావేదనకరమైన యా నాఁటి మాటను ముగ్వురును గూడ విస్మరించి యుండిరి.

ఆ గ్రామ మధికజనాకీర్ణము కాకపోయినను విశాలమైనది. భాగ్యవంతుల గృహములు నాలుగైదుగలవు. దామోదరరావుతండ్రియే యా గ్రామమందు భాగ్యవంతుఁడు. సుందరము,విశాలమునగు భవనము. భవనముయొక్క నల్వంకలయందు మనోహరమైన యారామము. ఆ యారామమునందు శ్రాంతులు విశ్రాంతిఁ దీసికొనుటకై చిన్న చిన్న వేదికలు పాలఱాతితోఁ గట్టఁబడియున్నవి.ఆవేదికలసమీపముననే నాసికారంధ్రములకు విందొనర్చు బూదీవ లల్లిబిల్లిగనల్లుకొని చూపరుల మనసున కానందమును, నేత్రములకువిందును, నొనర్చుచున్నవి. వారి గృహమందనేక యతిథులు ప్రతిదినము భుజించుచుందురు. దామోదరునిపైఁ దండ్రికిఁ బ్రేమమపారము. సరసుఁడు. విశాలహృదయుఁడు. కుమారుఁడగు దామోదరుని ప్రవర్తనమున కభ్యంతరము సేయఁడు. కావున దామోదరుని జీవితము ధన్యమనవచ్చును.

మాధవరావు అభిమానశాలి. చిన్నతనముననే తలిదండ్రులు మరణించుటవలన నాధారములేక దామోదరుని యింటనే భుజించుచు

నాటపాటలయందుఁ జరువునంను నాతనితో సమభాగియగుచుఁ గాల మును బుచ్చుచుండెను. అందమున దామోదర మాధవులిరువురు నొకరినొకరు తీసిపోరు. విద్యావిషయములందుఁగూడనహామహామికతోఁ బనిచేయుచుందురు. ఒకప్పుడు మాధవుఁడే యుత్తముఁడుగ నుండును.

కమల కేవల మనాథబాలిక. ముఖమందు నేత్రములందు నమాయికత్వము స్ఫురించుచుండును. నేత్రము లాకర్ణాంతములై తామరతేకులవలె సువిశాలముగ నుండును. తుమ్మెదరెక్కలవలె నల్లనై సొగగానుండు గేశకలాపము పచ్చనిముఖమునకు వింతవన్నె నొసఁగూర్చుచుండును. బాల్యముననే యాప్తులందఱు తన్ను దరిఁజేరగాని దుఃఖసాగరమున ముంచి పరలోకగాము లౌటవల నామె మేనమామయింట వసించుచు దామోదర మాధవులతో నాగ్రామము నకు సమీపముననున్న పట్టణమునకుఁ బోయి విద్యనభ్యసించుచుండెను. విద్యావిషయములందు దామోదర మాధవులకన్న గమలయే యధిక రాలు. కొన్ని క్రొత్తవిషయముల నామె వారలకు బోధించుచుండును. ఆమె బోధనాశక్తికిని విషయగ్రహణ శక్తికిని, జ్ఞాపకశక్తికిని వార లచ్చెరువందుచు నామెనుస్తుతించుచు నామెసమక్షమున ముగ్ధ లగుచుందురు.

సాధారణముగాఁ గళాశాలయందలి చర్చనీయాంశములలోఁ బాల్గొనునపుడు కమలా మాధవులొకదెసను, దామోదరుఁడొకదెసను వాదించుట యాచారము. నాఁడు చర్చనీయాంశము "స్త్రీపునర్వివాహ ములు కూడునా? కూడవా?" యని. ఈ విషయమునం దుఁ గమలా దామోదరులు- స్త్రీపునర్వివాహము తప్పక యావశ్యకమనియు, అట్లైనఁ గాని మనహిందూ స్త్రీసంఘ మున్నత స్థితికి రాఁజాలదనియు, దానివలన నార్థికముగా, నైతికముగా, లాభములు గలవనియు మత మందుఁగూడ దానికిఁ బ్రతిపత్తి లేదనియుసప్రమాణముగానిరూపించిరి.

వారిమాటలు యుక్తియుక్తముగా నున్నందునఁ గళాశాలాధ్యాపకులు మిగుల సంతసించి వారల యభిప్రాయమును గొనియాడిరి.

స్త్రీపునర్వివాహములు కూడవని మాధవుఁడు ప్రతిపాదించిన విషయము వీఁగిపోయెను. అతఁడు కమలకు లభించిన యాదరణకు, స్తుతికిసంతసించెనుగాని యామె యభిప్రాయ మతని కంత యుక్తముగా దోచలేదు.

అభిప్రాయభేదము లున్నంతమాత్రమున నుత్తములు కలహింపరు. వారిస్నేహమునకు నభిప్రాయభేదములు భంజకములుగావు. ఇది పర కెన్నియో పర్యాయములు కమలామాధవులకు విరుద్ధాభిప్రాయములు జనించినను, ఆయభిప్రాయభేదమువలన నాతని కేవిధమగు నావేదనయుఁ గలుగలేదు. కాని యీపర్యాయ మీవిషయము నందు కమల యభిప్రాయమువలన మాధవునకు ద్వేషముకలిగినది. తన్నుతానే నమ్మలేదు. కమల హృదయసాక్షిగా నట్లు పలుకక దావెనాదరునిబల పరచుట కట్లుమాట్లాడెనేమో యని తలఁచెను గాని యామెహృదయావేదన యతిశయించెను. ఊహామార్గముల నిర్మించుకొనిన సౌధరాజములు మొదలంటనేలఁగూలినవి. నిట్టూర్పు సెగలవలన నాతనిముఖము నల్ల పడెను, కాని యీయావేదన, హృదయభారము, నిస్పృహ మరునాటికే నశించినవి. వారుముప్వురును యథాపూర్వముగ స్నేహభావముతోనే మెలఁగుచుండిరి. ప్రతిదినము, ముప్వురును కలసి విహారార్థము గౌతమీతీరమునకో, ఆరామప్రాంతమునకో పోవుచుండిరి. పరస్పరము ప్రేమ పూర్వముకంటె నతిశయిల్లుచుండెను. వారుముప్వురు నిప్పుడు సంపూర్ణయౌవనయుక్తులైరి. యౌవనతారుణ్యము వారి శరీరముల తళతళ మెరయుచుండెను. ఆమెపై వారిరువురకు ననురాగముదయించినను, లజ్జవలననో, యితరకారణమువలననో, తమప్రేమ

నామెకుఁ దెలియపరుప రైరి. ఆమె యభిప్రాయ మెట్లున్నదో తెలిసి కొనరైరి,

ఇట్లుఁ గొన్ని సంవత్సరములు గడచినవి, కాలము మహాప్రవాహమువలె గడచి పోవునుగదా?

వలపు

అయ్యది శరత్కాలము. సమయము సాయంత్ర మారుగంటలు శుక్లపక్ష మగుటచే నప్పటి కప్పుడే యెల్లెడల పిండి యారఁబోసి నటుల సుధాకరుఁడు తనసుస్నిగ్ధ కిరణజాలములను బ్రసరింపఁ జేయుచుండెను. సమీర కుమారుఁడు కుసుమ సౌరభము నాఘ్రాణించి యితరుల కానంద మొనగూర్చుచుండెను. పరోపకార మన నట్టిదియే కదా? పక్షులన్నియుఁ దమకులాయములందుఁ జేరి సుఖించుచుండెను. ప్రకృతి యంతయు నిశ్శబ్దముగను; గంభీరముగను, నానందదాయకముగను నుండెను. అప్పుడప్పుడు పూతగౌతమీనది తన యలల ధ్వనిచే నిశ్శబ్దమునకు భంగము కలిగించుచుండెను.

ఆ గోదావరీ సైకతస్థలియందు నొక యువకుఁడును నొక యువతియుఁ గూర్చుండి మాట్లాడుకొనుచుండిరి.

......కమలా! మనవిద్య పూర్తియైనదిగదా? భావికర్తవ్య మేమని యాలోచింపు చుంటివి?

......మాధవా! కర్తవ్యమున కేమున్నది గాని మనజీవనోపాధికిఁ దగినమార్గమేది?

......అవును అంటులకే నేనాలోచింపుచుంటిని దామోదరుఁ డదృష్టవంతుఁడు. అతనితండ్రి మరణించుటవలన నిపు డాతడే గృహ యజమాని వారింట. నింకను భుజించుట నా కభిమానముగ నున్నది.

...నాకు నష్టే యున్నది. ఎన్నిదినము లితరులయింట భుజింపఁ గలను. నీకేమి నీవు మగవాడవు. ఎట్లయినను నీపొట్టను పోషించు కొనగలవు.

......కమలా! ఎంతటి వెఱ్ఱిదానవు. తిండిలేక మరణించువారీ ప్రపంచమునఁ గలరా? మగవాఁడైనంతమాత్రమున యన్నము దొరకి యాడువారికి దొరకకుండునా? అయ్యది గాదు విచారణీయాంశము ప్రపంచమున మనుజుఁడై జన్మించునంగుల సదాశయములు, విశాల హృదయములు, భూతదయ, పరోపకారము కలిగి జీవనోపాధి కనువగు మార్గము నన్వేషింపవలయునని నాయాశయము.

నిక్కమే. నీయభిప్రాయముతో నేనేకీభవింతును. ఇట్టియుదాత్తాశయములు గలనీవు స్వతంత్రజీవన మాచరింపవలయునని నాసలహా. ఇట్టి యుచితమైన సలహా నిచ్చినందుకు నీ కేమి ప్రత్యుపకార మాచరింప వలయునో నాకు గోచరింప కున్నది.

నన్ను శాశ్వతముగ నీ మనసునం దుంచుకొనుట నాకుఁ బ్రత్యుపకారము.

ఈ మాటలగునరికి వారిరువురకు వెచ్చని నిట్టూర్పులు వచ్చినవి. ముఖమునం దేదియో భావముదయించినది. అభావమువలన మనసునకు సిగ్గు, శరీరమునకుఁ బులకాంకురములు బయలుదేరినవి. ఒకరిముఖము వంక నొకరు చూచు కొనలేరు. నిశ్శబ్దముగఁ దలవంచుకొని మనసునం దేవియో యాకాశసౌధముల నిర్మించుకొని, భావిపరిస్థితులను గమనించు కొని యిరువురును వాకేపర్యాయము తలయెత్తి మాట్లాడ నుద్యమించిరి. మాధవుని మాట విని కమల తనమాటనాపెను.

కమలా! మన మిరువురము బాల్యమునుండియు మిత్రత్వమున నున్నారము గదా? నాగుణములు నీకును నీగుణములు నాకునుం బూర్తిగ దెలియును గదా? ఎన్నియో దినములనుండి యకించనుండ నగు నేను నీప్రేమభిక్ష నర్థింప దోసిలొగ్గియున్నాను. మనసార ప్రేమించి వలచుటయే నా యభిమతముగాని పాశవశృంగారమునకుం బాల్పడుట నాయభిమతము గాదు. అదియుంగాక నోకదంపతులు, అన్యోన్యానురాగముతోం జిరకాలము వర్తింపవలయు నన్న వారిప్రేమ మానసీయమై యితరుల కాదర్శప్రాయము గావలెనన్న సత్సంతానమువడసి దేశసౌభాగ్యమునకుం బ్రాపుగావలెనన్న. పరస్పరప్రేమయే ముఖ్యము. కావున త్వదీయప్రేమ పిపాసువును, ప్రేమ భిక్షార్థిని నగు నన్ను కరుణింపుము. అకించనుండ నగు నన్ను వరించుటవలన దరిద్రమనుభవింప వలెనని నీంబోటి యుత్తమురాలు, విద్యావతి తలంపదు. స్వతంత్రజీవనమే ముఖ్యమని యింతకుమున్ను నీవే నాకు సలహా నొసంగితివిగదా!

ఈమాటలు వినినంతనే కమలకును సిగ్గుదొంతరలు ముఖమునం బ్రవేశించినవి. పులకలు శరీరమున మొలకలెత్తినవి. లజ్జాకలిత మనస్కయగుట కంఠస్వరము రుద్ధమయ్యెను. తన సమీపమందలి యువకు డింతకుం బూర్వముండెడి సామాన్యస్నేహితుండు గాడు. హృదయపూర్వకముగం బ్రేమించి వలచి వలపింపంజేసిన ప్రియుండు. ఆతని కేవిధముగ సమాధాన మీయవలయునో యాముగ్ధహృదయమునకు గోచరింప లేదు.

మన వివాహమును గూర్చి దామోదరరావు యొక్క యభిప్రాయమైనను తెలిసికొన వలదా?

కమలా! ఉన్నతవిద్య నభ్యసించి, నాగరికతగల నీకే యిట్టి ప్రాచీనాభిప్రాయములు నశింపలేదు. వివాహము వధూవరులయిష్టాయిష్టముల ననుసరించి యుండవలెను గాని యితరులపై నాధారపడి యున్నచో నాప్రేమ మనఃపూర్వకమా? శాశ్వతమా?

అనుచు "నాకోరికరిను నెఱవేర్పవా?" యని యామె హస్త స్పర్శ మాచరించెను. తోడనే యామె పరవశయాయెను. తనచేతిని నాతని చేతినుండి విడిపింపఁ బ్రయత్నించెను. కాని యాతఁడు వీడ లేదు. ఆమె శరీరమూపాదమస్తకము గాలితాఁకునఁ జలించు లతవోలెఁ జలించెను. తన యనురాగమున కాస్పదభూతుఁడును, మిత్రుఁడును, పరిచయస్థుఁడునగు మాధవుని మ్రోల నామె కెందులకో యంత సిగ్గు-కంపము? వారిర్వురు కేలఁగేలు గీలించుటయే యారామమునకుఁ బోయి, చలువతాతితోఁ గట్టఁబడి హృదయమున కాహ్లాదమొసఁగు వేదికయం దాసీనులైరి. పుష్పసౌరభము నాఘ్రాణింపఁ గలన్వన మాచరించుచు భృంగకుమారుని గీతికారవమే మంగళధ్వనులు గాఁగ, లతాపుంజము నుండియు, వృక్షసంతతి నుండియు రాలిన, కుసుమ సముదాయమే మంగళాక్షతలు గాఁగ, యుపనీయువకులనుఁ బ్రేమింపఁజేసి వారల సంతోషమునకుఁగాని, సంతాపమునకుఁగాని, కారణభూతుఁడగు మదన మూర్తిపురోహితుఁడుగాఁగ, వారివివాహముహూర్తము సమీపించెను.

ప్రేయసీ! వధూవరుల పరస్పరానురాగమే వివాహమునకు ముఖ్యసూత్రము. ప్రేమయే లేకున్న నాదంపతుల సౌఖ్య సాధనములు నాశనము గావలసినవే. కాని, మనసంఘమిపుడు కేవలమనాలోచిత ముగఁ బ్రవర్తించుచున్నది. ప్రేమసూత్రముపై నాధారపడు మంగళ సూత్రము కంఠసూత్రముగా భావింపఁబడుచున్నది. నాయికానాయకుల పరస్పరప్రేమభంజకములగు ఘోరనియమముల నెన్నిటినో మన సంఘము రక్షించుచున్నది. అట్లు సంరక్షించుటయే కాక, యయ్యవియే యోగ్యములని తలంచుచున్నది. నేను నిన్ను ప్రేమించి వివాహముచేసి కొను విషయమున నితరుల సహాయమపేక్షింపను. నీవు మనస్ఫూర్తిగాఁ బ్రేమించి యాజన్మాంతము నా సుఖదుఃఖములలో సహధర్మచారిణివై యుండుటయే నా యభిమతము.

ప్రియా! నీపవిత్రప్రేమకును, ఉదారాశయములకును మిక్కిలి సంతసించితిని.

అని కమల మాట్లాడు చుండఁగనే, మాధవునిహస్తమామె చెక్కిలి నొక్కెను. అప్రయత్నముగ జరిగిన యీ కృత్యమునకుఁ గమలా మాధవు లిరువురు ముసిముసి నగవుల నవ్విరి. వారి యానందమునుఁ గాంచి చంద్రభగవానుఁడు గూడ నవ్వెను. వారన్యోన్యపరిరంభరణ మొనర్చుకొనిరి. శరీరమును మఱపించు పూలపుఁజూపులఁ దక్కఁగల జగమునేమఱచి, యానందసాగర తరంగడోలికల నూఁగులాడుచుఁ బర స్పరము పరిహాసము లాడుకొనుచు నధరామృతపానము గొఱ కాసిం చుచుఁ జెంతనున్న గోదావరీ తరంగారావమును గాని, వృక్షాగ్రమున నుండి నెత్తురుఁగ్రక్కు నేత్రములతోఁ జూచి భయంకరారావ మొనర్చిన ఘూకరాజమును గాని, సమీపమున నుండి పొంచి వారివృత్తమునుఁ దిలకించుచున్న వ్యక్తులనుగాని గాంచలేను. ఉలూకరాజముయొక్క భయంకరారావమునకు ఫలమేమో? భవిష్యద్విధాన మెట్లున్నదో? తెలిసికొనుట యెవరితరము?

సామాన్యముగా విహారమునకుఁ గమలా మాధవ దామోదరులు ముగ్గురునుఁ గలసియే వచ్చుచుందురు. ఆ నాఁ డేదియో గృహకృత్య ముండుటవలన దామోదరునిరాక కొంచెమాలస్యమైనది. అతఁడు తొందరగ గార్యములను జక్కబెట్టుకొని, మిత్రులనుఁ గలిసికొనుటకు నాతురతతో, వారలు తనకొఱకు వేచియుందురను నాశతో, మిత్రు లను విడనాడవలసి వచ్చెనే యను హృదయావేగముతో, గోదావరీ చెంత కరుదెంచెను. కాని, యచ్చట వారిజాడ కానరాలేదు. అంతకు మున్నె యెవరో యిరువురు వ్యక్తులుగలసి యీ త్రోవవెంబడి వెళ్ళి యుండిరని సైకతస్థలము నందలి పదచిహ్నములనుబట్టి గ్రహింపఁ గల్గెను. అతఁడు చేలీ! కమలా! మిత్రమ! మాధవా! యని నిరాశావ్య

కంఠస్వరమునఁ బిల్చుచుఁ గమలా మాధవులు ప్రవేశించిన యుద్యాన వనముం జేరెను. అందుఁ బ్రకృతిధర్మమున ననుకూలముగఁ నాహారాదికమున శుకము తన యాత్మజాయను సంతసపెట్టుటయు, లతాలలామ వృక్షరాజము నల్లిబిల్లిగ నల్లుకొనుటయుఁ గాంచి పైకిఁ దెలియఁజేయ లేని మూగబాధను హృదయమున ననుభవించెను. ఏదోయొక భావము స్మృతిపథమున గోచరింప నద్దానికి మాఱుగాఁ బైకివెచ్చని నిశ్వాసమును విడచెను. పదములవలన యలికిడినైనను గలుగనీయక, నోటివెంట మాటనుగూడ రానీయక, కమలాన్వేషణ తత్పరత నొక వేదికచెంత కరుగ నిశ్చయించుకొనెను.'

"కలయా! నిక్కువమా! కన్నెదుట సౌఖ్యతరంగములనోలలాడుచున్న యువతీయువకులు కమలామాధవులేనా? నాహృదయాపహారిణి, నావలపు బంటయునగు గమలయే యిట్టికృత్యము కొడంబడెనా? దుస్సరము-దుస్సహము. లేఁతగులాబీ పుష్పమువంటి యౌవనమును దోసిటఁబట్టి ప్రేమభిక్ష నర్థింప నుద్యుక్తుఁడనుగా నున్న నన్ను-నా యాశలను,-నా యూహాసౌధములను, నా భావిజీవితసౌఖ్య సోపానములను గాల నేలఁగూలద్రోచినది. స్త్రీహృదయము దుర్గ్రాహ్యము. నావలపును గుర్తెఱింగి, నన్ను వలచినట్లు నటించి, చిట్టచివఱకు మాధవునిఁ బతిగాఁజేసికొన్నదికదా? ఇఁకఁ గమల నా స్నేహితురాలుగాదు. ఆమె యిప్పుడు పరవనిత. అగ్నిజ్వాలనైనను నంటవచ్చునుగాని యామె నంటరాదు-స్మరింపరాదు. ఆమె యిప్పుడు మాధవుని భార్యయిల్లాలు. మాధవుని గృహమునకు యజమానురాలు- అని తలంచుచు, హృదయ భారమును డిందువఱుపఁ బ్రయత్నించుచు, ఆశ్చర్యము-సంతాపము-ఆవేగము-తిచ్చపాటు-హృదయభారము-శిరోవేదన-ముప్పిరిఁగొన,నొక్క యడుగైనను ముందునకు సాఁపలేకపోయెను_ఒక్క మాటనైనను వలుక లేక పోయెను-ఒక్క భావమైనను దెలియజేయలేక పోయెను_ఒక్క

వేడికన్నీటి బిందువునున్నైతము రాల్చలేక పోయెను.

భీకరమైన యులూకరాజముయొక్క ధ్వనితో మేళవింపఁజేసి, గోదావరీ తరంగారావముతోఁగలిపి యొక్క పెద్దకేకను మూఁతిము వేయవలయునని యాతని యభిప్రాయము. ఆతని పెనుగేకవలనఁగమలా హృదయము కరఁగ వలసినదే? మాధవుని మనసు గ్రుగవలసినదే? వారి సౌఖ్యసౌధములు నేలఁగూల వలసినవే? ఆయిరువ్వుర భావిజీవితము లంధకార బంధురములు కావలసినవే? మాటలాడ నశక్తుఁడగు నాతనికంత తోపిక యెటనుండి వచ్చినదో! ... ...

ఇందుఁ గమల తప్పేమున్నది? ఆమె మానవస్త్రీ. మానవునకు సహజముగా నుండవలసిన కామక్రోధము లామెనుఁగూడ నాక్రమించినవి. మాధవుఁడుఁగూడ నావంటివాఁడే కదా? నాకుఁగమలపై నెంతయనురాగముగలదో యాతనికిఁగూడ నట్లే యుండవచ్చును. ఆమెయెడ మాయిరువ్వురి యనురాగములు సమానములే! నా యనురాగమును—నా ప్రేమను, లజ్జాతిరేకమున నామెతో నుచ్చరింపనైతి. మాధవుఁడు తన యనురాగము నెఱిఁగించెను. ఆమె యంగీకరించినది. వారిరువురు నిప్పుడు భార్యాభర్తలు. పరస్పరప్రేమ నభిలషించి యర్థించి, కృతకృత్యులైరి. నేనే యన్నివిధముల హతాశుఁడను. నావిధిని దూఱుకొనవలయును గాని, కమలా మాధవుల దూషించి—వారి ప్రణయ సౌధముల నధఃపతితములఁ గావించిన నాకువచ్చు గౌరవమేమి? ప్రయోజనమేమి? అదియుఁగాక కమల యిప్పుడు మాధవుని భార్య,పరవనిత. హిందూమత ధర్మమునను సరించి మాధవుడే కమలకుఁ బతి. పరదైవతము—అన్ని విధముల నతడేఁ యామె కారాధ్యుఁడు. నేనింక, మాధవుఁడామె పతిగా నున్నంతకాలము కమలను దర్శింపను- మాటాడను- ఇంతియకాదు-హృదయమునఁగూడ స్మరింపను. మా నాయనగారెన్ని యో సంబంధముల నిశ్చయపఱచి నాకు వివాహము గావించెదనన్నను-

ఏ కమల కొఱకు బ్రహ్మచర్యము నవలంబించి యుంటినో యా బ్రహ్మచర్యమునే, ఆ జన్మాంత మవలంబించెద. ఉత్తరజన్మము నందైనను గమల కొఱకై నా యౌవనమును మూటగట్టెద. అని తలఁచుచుఁ దాను వచ్చిన దారినే దామోదరుఁడింటికిఁ బోయెను.

సంసారనౌక.

ఆ గాఢపరీరంభమున కెంతకాలము నొడలు, జగము తెలియక యనఁగి పెనఁగి వర్తించిరో! ప్రణయ సామ్రాజ్యమును నిరాటంకముగ నెంతకాలము నేలఁగల్గిరో! ఆస్వాదనీయము, మధురము నగు నా ప్రేమామృతము నెంతకాల మాస్వాదించిరో! నిష్కళంకము, పవిత్రము నగు నా ప్రేమవాహిని యందెంతకాలము మునిఁగి స్నానమాచరించిరో! సుప్రసన్నములు, తేజోసహితములు, పవిత్రభావయుక్తములు నగు బరస్పరముఖముల నెంతకాలము తనివితీరక దర్శించిరో! ఎవరి కెరుక?

కమలా మాధవు లిప్పుడు భార్యాభర్తలు. వారిరువురు కర్ణధారులై సంసారనౌకను సాగింపఁ బూనుకొనిరి. కాని, యానౌక నడచుటకు నీరముచాలదు. మార్గ మగమ్యము, విద్యార్థిదశయందున్నప్పటి నుండియు మాధవున కొకరియొద్దఁజేరి, వారి యనుగ్రహమువడసి ధనసంపాదన మాచరించుట యన్న నయిష్టము. ఎంత యున్నతవిద్య నభ్యసించి యున్నను, దెలివితేటలనుఁబట్టి యుద్యోగము లీయనందున నాతనికి భార్యను బోషించుటయే దుర్భరమాయెను. ఈ విషయమును

గూడఁ గమల గ్రహింపక పోలేదు. అతఁ డెచ్చటికైనను బోయి, యింటికి వచ్చినప్పటికి నర్ఘ్యపాద్యాదివిధుల నాతనిఁ బూజించి మార్గాయాసము, శ్రమ నశించునట్లు చల్లనిపలుకుల నాశ్వాసించి, యాతని ధైర్యమునుఁ జక్కఁబఱచుచుండెడిది. ఇంటఁబియ్యము లేకపోయినచో నా విషయమును మాధవునకుఁ దెలియనీక పొరుగింటనుండి గౌరవముగా బియ్యము నప్పుగాఁదెచ్చి, కూర లేకపోయిన నేదేనివస్తువును రుచ్యముగాఁ దన నేర్పువలనఁ దయారుచేసి యాతనికి మనశ్శాంతి నొనఁ గూర్చుచుఁ దాను తెలుచు భర్తకుఁ దెలియకుండఁ బన్నుగానే నివసించుచు భర్తృగౌరవమును, ఆత్మగౌరవమును, కుటుంబగౌరవమును నిలఁబెట్టుచుండెడిది. గృహిణీధర్మములఁ జక్కఁగా గుర్తెరింగి, హిందూమత సాంప్రదాయము ననుసరించి, యితరుల కాదర్శభూతురాలై మాధవుని మనసున కానందమొనఁ గూర్చెడిది. అట్టి గృహిణీమతల్లులే గదా! గృహలక్ష్ములు. అట్టి గేస్తురాండ్రఁగన్న భారతమాత పూజనీయ.

సహధర్మచారిణి యిట్టియిక్కట్టులకుఁ బాల్పడుచున్నదనియు, సంసారసాగరమును దరించుటకు వలసినంత ద్రవ్య మావశ్యకమనియు, ద్రవ్య సంపాదనకొఱకై మార్గము నన్వేషింపవలయుననియుఁ దలంచి, మనసునందేదియో నిశ్చయించుకొని కమలను బిలచెను. ఆమె యతి దీనమున, భర్తృసమీపమునఁ దనకుండు స్థానముననుసరించి వచ్చి నిలఁబడి తనమృదు వీక్షణముల నాతనిపైఁబఱపెను.

కమలా! ఇటుగూర్చుండుము. నీ వొకనాఁడు నాకిచ్చినసలహో జ్ఞప్తియందున్నదా!

...అవును జ్ఞప్తియందున్నది. 'ఇట్టి యుదారాశయములు గల నీవు-కాదు- కాదు- మీరు స్వతంత్రజీవన మాచరింపవలయునని'

ఇప్పుడు నీసలహో ననుసరించుటకు నీయాజ్ఞ యవసరము.

...మీ యుద్దేశముతోఁ దప్పక నే నేకీభవింతును. మీ నిశ్చయమున కెన్నఁడు నభ్యంతరము పెట్టను.

అట్లైన వినుము. స్వతంత్రవృత్తులవలన నిప్పుడేమియు లాభము కలుగుటలేదు. వృత్తివిద్య లడుగంటినవి. నాకుఁ జిన్నప్పటినుండియు నౌకాయానమన్న నిష్టమనుసంగతి నీవెఱుగుదువుకదా? దుస్తరమగు నీసంసార సాగరమును దరించుటకు నౌకాయానమే యుత్తమమైనదని కూడ నామనసునకుఁ దట్టుచున్నది. అద్దాన విశేషధనము లభించవచ్చును. కావున నౌకాయానమునకై నీవాజ్ఞయొసంగవలయును.

మనమిరువురము గలసియే పోవుదమా?

"ప్రియసీ! అట్లైన నాకీపరితాపమేల? నిన్ను గొంతకాలము విడనాడవలసి వచ్చుచున్నదనియే నాహృదయావేదన. మనస్ఫూర్తిగాఁ బ్రేమించి సహధర్మచారిణివై మెలంగు నిన్ను సంతోషపెట్టుట లేదని నాతలంపు. నిర్ధనుఁడనగు నన్ను వరించితివికదా!

ప్రియా! పవిత్రమైన ప్రేమకు ధనము,వస్త్రములు కావలయునా? నౌకాయానమొనరించి విశేషధనము నార్జించి, మఱల మీర లరుదెంచిన సుఖంపమా? సంతోషింపమా? ఈ యల్పకాల విరహమునకే మీరింత పశ్చాత్తాప పడనేల? మీరు తప్పక నౌకాయాన మొనరింపుఁడు. అని భర్తను హెచ్చరించి యాతనిధైర్యము నినుమడింపఁ జేసెను.

దినవెచ్చమునకైనను జేతఁగాసులేని యా యకించనుఁడు నౌకాయాన మొనరింప నుద్యుక్తుఁడై వలయు సామగ్రిని సేకరింప దామోదరుని కడ కేగి మిత్రభావమున నాతనియొద్దనుండి, కావలసినద్రవ్యమును బుచ్చుకొని వేరానతోఁ బ్రయాణమునుండి తిరిగివచ్చిన పిమ్మట సుఖంపవచ్చునను నూహతో కమలయంగీకారమును గైకొని నౌకాశ్రియమున కేగెను.

అదృష్టవంతున కప్రయత్నముగ నైనను సంపదలభించును. దురదృష్టవంతుఁడాముదముతాచికొని పొర్లినను సిరియంటదు. మనుష్యుఁడేకర్మ నాచరించుచున్నను దైవసాహాయ్యము కొంత యావశ్యకము. దైవసాహాయ్యములేనిమనుష్యకర్మ పరిపక్వస్థితి నందనేరదు. అట్లని కేవలము దైవముమీఁదనే భారముంచి మనుష్యుఁడు ప్రయత్నముచేయుటను మానఁగూడదు "దైవం విహాయకురు పౌరుషమాత్మశక్త్యా యత్నేకృతేయదినసిద్ధ్యతి కోఽత్రదోషః" అని చిన్నప్పుడు చదువుకొనిన శ్లోకము స్మృతిపథమునఁదట్టలేనిధైర్యమును దెచ్చుకొని, ఇంతవఱ కాచరించిన ప్రయాణమునం దిసుమంతయు లాభము లేకపోవుట వలన నిరాశఁజెందుచు, ముందైనను గావలసినంత ద్రవ్యము దొరకఁ గలదని ధైర్యము నవలంబించుచు, రిక్తహస్తములతోఁ గమల నేరీతి దర్శింతునని హృదయావేదన చేతఁ గుందుచు, నేను అదృష్టవిహీనుఁడ నైనను, గమల యదృష్టమునుఁ బట్టియైనను, ఆమెసౌఖ్యమున కైనను, మాసంసార మొకవత్సరము గడచు ధనముం జేకూర్పవా? సర్వేశ్వరా! యని ప్రార్థించుచు- కమల స్త్రీ కాదు. ఆమె దేవత. పవిత్రప్రేమ, నిర్మలానురాగముండఁబట్టియే యీ దుర్భరదారిద్ర్యము నందైనను నేనిన్నాళ్లు జీవింపఁగల్గుచుంటిని. ఆమె మృదువీక్షణములఁ బాధేయముఁగాఁ గొని ప్రయాణము నందితర భోజనాదికము లేకపోయినను సుఖించుచుంటిని. అని తలంచుచు ధనములభించు నేమోయను నాశతో ననేక నౌకాశ్రయములఁ దిరుగాడఁజొచ్చెను. ఆసంచారముల వలన శరీరరాయాసమేకాని ధనలాభ మేమియుఁ గలుగుటలేదు. ధనలాభము లేకపోవుటయేకాక శరీరమం దనారోగ్యము గూడఁబ్రవేశించెను. క్షయవ్యాధివలన నాతఁడు బాధపడఁజొచ్చెను. జ్వరముకూడ నతిశయించెను. ఇట్టి యవస్థయందున్న వానిని, నావికులు గృహమునుఁజేర్పఁ బ్రయాణమునుండి మఱలిరి.

ఇంటఁ గమల, మాధవుఁడింకను రాలేదనియు, రాకపోవుటకుఁ గారణ మేమా యనియు, విశేషధనవంతుఁడై రాఁగలఁడనియు, ధనమును సంపాదించి వచ్చినయాతనినెట్లుసంభాషింపవలెననియు,సంకల్పమార్గముల నన్వేషింపుచు, నూహాసౌధముల నిర్మించుచుఁ, బ్రతిదినము మాధవుని రాక కెదురుచూచుచుండెను. ఇట్టి నిర్ధనుని వివాహమాడితినే యని యొకపర్యాయమైనను నా యబలాలలామత లంపలేదు. పతి నిర్ధనుఁడైనను, రోగియైనను, విశేషధనవంతుఁడైనను, నాతఁడే సర్వథా పూజ్యుఁడనెడు హిందూనారీధర్మమే, ఆ పవిత్రాశయమే, మనో ధైర్యమును, చిత్తశాంతిని గలిగించుచుండెడిది. నాఁడేలకో కుడికన్నదరుచుండుటవలన 'స్వామీ నాసంసారమునకు భంగము వాటిల్లనీయకుము. నాభర్తను శీఘ్రముగా నాదరిఁజేర్పు' మని భగవంతుని బలుమాఱు ప్రార్థించుచుండెను.

ఆయాసమున బయలుదేఱు శ్వాససంతతి, నిట్టూర్పు సెగల వలనను, విరహాగ్ని వలనను, ఆహారాభావము వలనను, శుష్కించి నల్లఁబాఱి, భయంకరమగు ముఖము, మాసినగడ్డము కలిగి, నీరసమువలన నొకయడుగైనను గదలుపలేక సుపరిచితులకుఁ గూడ సంశయమును గలిగించురూపముతో, ధనాభావమునఁ గాలినడకనే యింటికి వచ్చుచున్న మాధవుని-కాదు భర్తనుఁ గమల కాంచినది. తన నేత్రములను దానే నమ్మలేదు. విశేషధనముతో నరుదెంచునని పేరాశతో నిర్మించుకొనిన యాకాశసౌధములు భగ్నమయినవి. తనవిధి నొకపర్యాయము దూఱినది. భర్త వీధిగుమ్మము చేరఁగనే తన కరావలంబనము నాతని కొసఁగి, యత్యాదరమునఁ బ్రేమలొలుకు మాటలవలననాతని మార్గాయాసము నపనయింపఁజేసి, చాలరోజుల నుండి భోజనములేక యున్న నాతనికి రుచ్యమగు వంటకములఁ దయారుచేసి భోజనము పెట్టినది. భార్య యొక్క యాదరమువలన మాధవుని మార్గాయాస మంతరించి

నది-స్వగ్రామమును, స్వగృహమును, స్వపత్నీలలామను గాంచుటవలన నాతని వ్యాధి తగ్గినట్లే తోఁచినది. భోజనానంతరమునఁ గమలకు,మార్గమందుఁ దనకుఁ గలిగిన నష్టములు, ధనసంపాదన కొఱకాచరించిన ప్రయత్నములు, తనకు వ్యాధివలనఁ గలిగినబాధ, పరిచయస్థులు తన కొనర్చిన సేవలు, మధ్య మధ్య సిన్ను కూర్చిన యాలోచనలు—నిట్టూర్పుసెగలు, మొదలగు మార్గమందలి తన యనుభవములను బూసగుచ్చినట్లు భర్త భార్యకు వినిపించెను.

ప్రవాసము.

సుఖ దుఃఖము లవస్థాంతరముల ననుసరించి మాఱుచుండును. చాలకాలము సుఖమునను భవించిన వ్యక్తి స్వల్పకాలమైనను దుఃఖ మనుభవించి సుఖ మనుభవించుట తేలిక అయ్యెడి ప్రకృతిధర్మము. ప్రకృతి తనంతనే మానవుని యవస్థాంతరాపన్నునిఁ జేయును. అట్లవస్థాంతరము నాశ్రయింపని వ్యక్తి సజీవుఁడుగాఁడు. నిర్జీవప్రతిమ మార్పులేక, చలనములేక నొకేరీతిగనుండును. ఇది యంతయు జగన్నాటక సూత్రధారి మాయావిలసిత కృత్యము. ప్రాటకుఁగూడఁ దిండిలేకమలమల మాడు బీదవాఁడు హంసతూలికాతల్పమున శయినించు నదృష్టము సిద్ధించును. హంసతూలికా తల్పమున శయినించు లక్షాధికారి భిక్షాధికారి కావలసిన దురదృష్టము దాపురించును.

మాధవుఁ డిప్పుడు సంపూర్ణముగ నారోగ్యవంతుఁ డాయెను. ఆతని మనసును వేధించి, శరీరమును బీల్చి పిప్పిఁజేసి శుంష్కింపఁ జేసెడి దుర్భర దారిద్ర్యము-స్వతంత్రజీవనము-సంసార సౌఖ్యము-అను తీవ్ర సమస్యలు తొలఁగినవి. దారిద్ర్యమునశించినది. స్వతంత్రజీవనమలవడినది. సంసారసౌఖ్యము చేకూరినది. భార్యా భర్తలన్యోన్య ప్రేమపూర్వకము నానంద యుక్తముగఁ గాలము గడపుచుండిరి. కమల యిల్లాండ్రికెల్లను మేల్బంతియై యామె నియమము లందఱికి నాదర్శభూతములైనవి. ఆ ప్రేయసీ ప్రియుల యనురాగమునకు ఫలముగ నొక పుత్రికారత్న ముదయించెను. ఆమె ముఖమండలము రాకాసుధాకరుని గేలించుచుండును. సర్వవిధములఁ దల్లిని బోలియున్న నామెనుఁ జూచి జ్యోతిష్కుఁడొకఁ డామార్గమునఁ బోవుచుఁ బెదవి విరచెను. అపత్యము దంపతుల యానం దసుగంధిగావున నానందానమును గాంచి వారిరువురు మిగుల సంతసిం చుటయేకాక వారియనురాగము వృద్ధికాఁదొడంగెను. తరువాత నిరు వురు పుత్రులుగూడ నుదయించిరి. అందుఁ బెద్దకుమారుఁడు తండ్రిని బోలినవాఁడు. అదృష్టవంతుఁడు.

బీదవాఁడగు మాధవుని కింతహృదయశాంతి యెట్లుకలిగె? ఆతని స్వతంత్రజీవనమునకు మార్గమెయ్యది? అని పాఠకులు ప్రశ్నింప నవ సరములేదు.

ఆతఁడు సంపూర్ణారోగ్యవంతుఁడైనపిదప భార్యసలహా ననుస రించి కొంచెము పెట్టుబడితో వర్తకమును బ్రారంభించెను. ఆవర్తకము వలన నాతనికి విశేషము లాభమురాఁజొచ్చెను. అట్లే క్రమ క్రమముగ నాతఁడు సంసారమునకు లోటులేకుండ ధనసంపాదన మాచరించుచుం డెను. ఆసంసారసౌఖ్యమే చిత్తశాంతికి హేతువు. కమల సంతోషించు టయే తనసంతోషము. కమలకేమియు నాపదరాక సౌఖ్యముగనుండు టయే యాతనియభిమతము. భాగ్యవంతుఁడగు దామోదరుని వదలి

పూటకుఁగూడ దిక్కులేని తన్ను వలచి-పేర్మించి-ఆరాధించి-చిత్తశాంతి నొసఁగూర్చుఁగమలకంటె నాతని కన్యులెవరు? సర్వదా తనసంతానము నందే దృష్టియుంచి వారలకేమికావలసినఁ దాను స్వయముగాఁ దెచ్చి యిచ్చి కమలహృదయమునకు మాధవుఁడు సంతోషము నొసఁగూర్చు చుండును. కమలసౌఖ్యమే మాధవుని హృదయశాంతికిఁగారణము.

ఇట్లుఁ గొంతకాలము గడచిన వెనుక నొక కోటీశ్వరుఁడు తన యోడపైఁ దనకుఁ బ్రతినిధిగ మాధవుని వరుగుమనియు, దానివలన మాసమునకు విశేషవేతనము నొసంగుదుననియు, వేతనము సంగతి యటుంచి, నీవు పోయిననే కాని యీకార్యము నెఱవేరదనియు, బలు మాఱులు బ్రతిమలాడఁ జొచ్చెను. కమలా వియోగము-అంతకంటె నధికమగు సంతానవియోగము-అందఱికంటె నధికప్రీతి పాత్రుఁడును, నాఁటికి నాలుగు రోజులనుండి దుర్భరరోగముచే బాధపడుచున్న-చిన్ని కుమారుని వియోగము-అతనికిఁ గష్టదాయకము లయ్యెను. అయినను, దానంగీకరించిన కార్యమును పడఁబుచు యిష్టములేని వాఁడగుట వలనను నౌకాయానమన్న బాల్యమునుండియు నధికప్రీతి గలవాఁడగుట వలనఁ గమల యభిప్రాయమునుఁ దీసికొనకయే నౌకాయానమున కుద్యుక్తుఁడై యింటికి వచ్చెను.

యాతనా భూయిష్ఠమగు బాహ్యప్రపంచమును రోసి, పరబ్రహ్మా నందరసమును జూఱఁగొనఁదపస్సమాధి నిర్మగ్నుఁడై నిమీలితనేత్రుఁడౌ బరమహంసయుంబోలె, బాహ్యప్రపంచమునే యెంఱుగక బాధవలనఁ గన్నులు మూసికొని, విచారభరమున బాష్పసిక్త నేత్రయగు మాత నైనఁ గాంచక మూల్గుచు శయ్యాయతుఁడుఁ జిన్నికుమారుఁడు పరుండి యుండెను. నిరతిశయానంద వైభవమున మఃఖమనుమాటనే యెఱుంగకఁ కుమార్తెయు, గుమారుఁడును, నాటపాటలఁ గాలముబుచ్చు చుండిరి. మాధవురావు సంతోషమున నింటికివచ్చి భార్యతోఁ దన

నౌకాయాన వృత్తాంతమును జెప్పెను. పిడుగుకంటెను బెట్టిదమైన యవ్వార్త నాలించినంతసనె యామె హృదయము దిగులుచేతఁ గలఁత నందఁజొచ్చెను. ఈ సమయమున భర్తను విడనాడుట యన్నను, అతని యాత్రికనుజ్ఞ నీయుటయన్నను, ఆమె హృదయము సంకోచించు చుండెను. ఇదివఱకెన్నియో పర్యాయము లతఁడు వర్తకవిషయముల కొఱకు, గ్రామాంతరముల కేగుచున్నప్పు డామె హృదయము విషాద నష్టముగాలేదు. అదియుంగాక నింతకు మున్నాచరించిన నౌకాయాన మున కామెయే ప్రోత్సాహకురాలు. ఆ సమయమునఁ ద్వరలోఁ బున స్సమాగమును నపేక్షించి హృదయపూర్వకముగాఁ బ్రోత్సహించి, గాఢాలింగనాది ప్రేమపూర్వక కృత్యముల సంభావించి, యనిపినది. కాని విషాదము నిసుమంతయుఁ జూపలేదు. అట్టి ధైర్యచిత్త మనము కల్లోల మాలికా క్షుభితసాగరము రీతినయ్యెను. ప్రయాణము మానుమని భర్తను బ్రతిమలాడినది. చిన్నకుమారుని రోగమునుగాంచి యతఁడారో గ్యవంతుఁడగు దనుక ప్రయాణము నాఁపుమని బోధించినను వినక యాంగ్ డిబాధల విడనాడి త్వరలో సౌఖ్యము నందఁగలడని పల్కెను. ఆ మాటకుఁ గమలాముఖమున విషాదముగాని, వికాసముగాని యుదయిం పక పోయినను మాధవుని ముఖమున మాత్రము విషాదము, నేత్ర ముల-బాష్పములు, వక్త్రమున నిట్టూర్పులును బయలుదేఱెను

ఆ విషాద బాష్ప నిశ్వాసములకుఁ బరిణామ మెట్లుండునో భగవంతుఁ డెట్లుసంకల్పించునో, ఆ జగన్నాటక సూత్రధారి కృత్య ములు రంగస్థలమున నెట్లు పరిణమించునో యెవరికెఱుక!

"నాథా! నే నీ జన్మమునందుఁ దమ యానవపద్మమును గాంచఁగలనో, లేనో, ప్రేమపూర్వకములు మధురములు నగుఁ దమ సంభాషణముల వినఁగలనో, లేనో, హృదయము నివురెత్తింపఁజేసి పరవశసౌఖ్యమును గలిగించుఁ ద్వదీయ పరిరంభ మందఁగలనో,

లేనో, యొక పర్యాయము యుష్మదానన దర్శన సౌఖ్యము, పిమ్మ పూర్వక సంభాషణ సౌఖ్యము, పరిరంభ పారవశ్యమునంద నిందు." అని యా కమల మాధవునిఁ గౌఁగిలించుకొని విచారింపసాగెను. కమలా! ధైర్యచిత్తవు, యుక్తాయుక్త వివేకయుక్తవునగు నీవే యింత విచారమునకుఁ బాల్పడనేల? నేను తప్పక త్వదీయానన పద్మసందర్శన మాచరింపఁగలను, త్వదీయ ప్రేమామృత సంభాషణముల నాలింపఁ గలను. ధైర్యము నవలంబింపుము. త్వరలోనే రాఁగలను చంటిపిల్ల వాఁడు శీఘ్రముగనే సౌఖ్యమందఁగలఁడనుచు నాతని దల్లియొద్దనుండి తీసి కొని ముద్దుఁగొని, మఱల నామెకుచేతికొసంగి మఱలఁగైకొని తనప్రేమ నంతను వెల్లడిచేసెను. అశ్రుపూరితలోచనులగు మాతాపితరులఁగాంచి, కుమారీ కుమారులు తమసంతోషమును వదలి వెలవెలఁబోయిచూచు చుండిరి. వారలనిరువురఁ జేరదీసి, అమ్మా! మీయమ్మ చెప్పిన మాటను వినుచు నల్లరిజేయక ప్రవర్తింపుఁడు. త్వరలోనేవత్తును. మీరుతప్పక నన్ను గాంచగలరని పలుకుచు, దయామయా! పరమేశ్వరా! నౌకాయా నమున నాకెన్నివిపత్తులనైనను రానిమ్ము! అమాయికులగు నా దారా పుత్రాదులకేవిధమగు నపాయమును రానీయక సౌఖ్యముగానుంచుము. నాచిన్నకుమారునిఁ ద్వరలో శాంతచిత్తునిఁ జేయుమనినమనునఁ బ్రార్థిం చుచు నింటియొద్ద కావలసినసామగ్రినుంచి, తనకువలయు వస్తువుల నేక రించి, గృహము దృష్టిపథమునుండి మఱలువఱకు నటే దృష్టియుంచి పలుమారు భగవంతునిఁ బ్రార్థించుచు నౌకాశ్రయమున కేగెను.

నిర్ణీతసమయమున నోడలు బయలుదేఱెను ఆ యోడయందు నిర్భాగ్యుఁడగు మాధవుడేకాక నితరులగు బలువురువర్తకులు, బాట సారులు, దంపతులు, కుటుంబయుక్తులుగలరు. వారందఱు సంతోష ముతోడనే కాలమును బుచ్చుచుండిరి. మాధవుఁడుమాత్ర మాలు బిడ్డలపై మమకారమును వీడఁజాలక ధనకాంక్షను నిందింపుచు మనసున

నెన్నియో యూహాలు తలపోయుచు, రోగగ్రస్తుఁడైయున్న చిన్న కుమారుని సంతతసౌఖ్యము నాశింపుచు, భార్యయొక్కయు నితరసంతానము యొక్కయు సుఖజీవనమును గాంక్షింపుచుఁ బ్రయాణ మాచరింపుచుండెను.

నౌక జలధిమధ్యమునఁ బోవుచుండెను. సముద్రమంతయు నుత్తుంగగంభీరతరంగమాలికలచే నూఁగుచుఁ జూపఱులమనమునకు భయాశ్చర్యములఁ గొల్పుచుండెను. పాంథుల దురదృష్టవశమున ఝంఝామారుతము వీవసాగెను. ఆకాశమంతయు మేఘపటలసంఛన్నమైనది. వర్షధారలు పాంథులయశ్రుధారలతోఁగూడి పడవసాగెను. సముద్రమంతయు నల్లకల్లోలము గాఁజొచ్చెను. ఇంకేమున్నది? సర్వనాశనము. ప్రళయము-తుపాను. ఆ తుపానుతోఁ బాటు బాటసారుల మనములందుఁ గూడఁ బెనుతుపాను బయలుదేరెను. ఓడలోనివారందఱు విపరీతముగ దుఃఖించుచుండిరి. నౌకయంతయు మునిఁగిపాతాళమునకుఁ బోవసిద్ధముగ నున్నది. అదృష్టవంతుఁడొకఁడైనను లేఁడాయని యందఱు మొఱవెట్ట సాగిరి. దంపతు లొకరినొకరు కౌఁగిలించుకొని, పరలోకమునందుఁ గూడ నట్లేయుండుటకు సంకల్పించుకొనిరి. కుటుంబముతో నరుదెంచువారు ఒకరినొకరు దుఃఖింపనవసరములేకుండ సంఘమరణము సంభవించుటకు సంతసించిరి. ఇంటికడ భార్యాపుత్రులుండువారు వారలను దలఁచితలచి విలపింపసాగిరి. యాతనామయమగు నీప్రపంచమును విడనాడి శాశ్వత సౌఖ్యములఁ జూఱఁగొందుముగదాయని కొందఱానందమందుచుండిరి. మాధవున కాధైర్యమెచ్చటిదో? నిశ్చలతపస్సమాధి మగ్నుఁడగు మునీశ్వరుచందంబున మనస్సులోనేదియో ధ్యానించుచుఁ బ్రాణములనువీడ సిద్ధమునయుండెను. ఓడ మునిఁగిపోవుటకుఁ బ్రయత్నించుచున్నది. తుపాను-మహాప్రళయము ఝంఝామారుతము-సర్వనాశనము-ఇంతలో నేదియో యోడ యాదిక్కునకే యరుదెంచినది. వాయువుశాంతించినది. వర్షము

తగ్గినది. నిర్భాగ్యులగు నే పదిమందియో తక్క మిగిలినవారందఱు నా క్రొత్తయోడపైఁ జేరుకొనఁగల్గిరి. ఆ పదిమందితోడను నౌక జలధి గర్భమున విలీనయయ్యెను. మునిఁగిపోయిన యోడయందున్న పదిమంది లోను నిర్భాగ్యుఁడు—కష్టజీవి-కమలాసౌఖ్యకాంక్షి-మాధవుఁడున్నాఁడు. క్రొత్తయోడయందలి వారందఱుపోయిన వారినిగుఱించిఁ వేఁడికన్నీటిధార నైనను విడువలేదు. స్మరింపలేదు ఎవరిసౌఖ్యము వారికే! పాడులోకము. ఆ యోడ తనమార్గమునఁబోయెను.

గాలితాఁకున, తరంగాఘాతమున నౌకవృక్షరాజ మరుదెంచు చుండ నద్దాని నాలంబనముగా గ్రహించి మాధవుఁడును, మఱి నలువురు వ్యక్తులును నొకదీవియంజేరిరి. ఆకాశమునుండియధఃపతితుఁడై పాతాళముఁవఱకుఁ బోవుచున్న పాపాత్ముఁడు మధ్యేమార్గమునశరీరము నొవ్వకుండ హంసతూలికా తల్పమునఁబడెను. దారి తెన్ను తెలియకుండ దుర్గమారణ్యమున నంధకారబంధురసమయమందు సంచరించు పాంథునకు దివ్యజ్యోతి కనులఁబడెను. వారి విచారమంతయుఁ బలా పంచలయ్యెను. ఎంతవిరాగియయ్యెను, సంసారమును రోయువాఁడ య్యెను, బ్రాణమందాశలేదని వచించువాఁడయ్యెను మనస్ఫూర్తిగా మరణము నభిలషించునా?

ఆ ద్వీపము మనుష్యసంచారయుక్తము గాకపోయినను, మను ష్యుని జీవనాధారమున కనువగు వస్తువులందు లేకపోలేదు. క్రూరమృగ సంకులముగాకపోయినను కొన్ని సామాన్యమృగములు లేకపోలేదు. ద్రాక్ష, నారింజ, పనస, అరటిమొదలగు ఫలవృక్షములుగలవు. అమృత ప్రతిమానములగు సలిలములుగల సెలయేరులు ప్రవహించుచుండెను. ఈపరిస్థితులను గాంచినవారలకు మఱల జీవితాశ యుదయించెను. వారలలోనెవ్వరును,నాద్వీపమెచ్చటిదో యేభాగమునందలిదో యెఱుఁగక పోయినను బ్రాణాపాయమునుశంకింపక,యందలిమధురఫలములనారగించి

యా సలిలములఁ గోరిలి ప్రాణమును సంరక్షించుకొనుచుండిరి. మరల గృహములకుఁజని దారాపుత్రాదుల దర్శించి సౌఖ్యపడఁగలమను నాశ వారి హృదయఫలకములను వీడిపోలేదు. దురదృష్టవంతులగు—కాదు—అదృష్టవంతులగు నిరువురు, పాపభాజనమగు నీలోకమును విడనాడి శాశ్వతసౌఖ్యములఁ జూఱగొనఁ బరలోకమున కేగిరి.

విరహము.

మధుపానమున నొడలుమఱచి మధురస్వనమున నాలాపించు భృంగకుమారుని గీతికారవమును, కుసుమసారభాఘ్రాణమున నీటుని చందంబునఁ బరిమళించు సమీరకుమారుని మధురశబ్దమును, తన ప్రియవనితవలనఁ గండూయనసౌఖ్యము ననుభవించుచు సుఖించి యానందించు హరిణదంపతుల తన్మయత్వమును, సగమారగించిమిగిలిన భాగము జాయనుగోఁ వించు చక్రవాకపక్షుల ప్రేమమహాత్మ్యమును గమనించి బాధనందుచున్న మాధవునిహృదయమునఁ దలఁపుల తమక ములు రేకెత్తసాగెను.

హృదయఫలకమునఁ జిత్రింపఁబడి విస్మృతినందియున్న భావ పరంపర పైకుబికి యాతని హృదయమును బీడింపసాగెను. అందలి సెలయేఱులు-చమరీకేశపాశములు-కోకిలాలాపములు-హరిణాంగనావిలా సంపుఁజూడ్కులు-అతనిహృదయమున వార్తి ప్రియాంగనను స్మరింపఁ జేసి, హృదయోద్దీపకరములాయెను. తమనైజచేష్టలమాని మాతల

యొద్దఁ బాలుద్రావుచుండిన మర్కటకిశోరములు. మచ్చికమీఱ మాత లందిచ్చుచున్న పచ్చికనుఁ దినుచుఁ దమ లేఁగొమ్ములఁ దల్లిసిఁ బొడుచుచుండిన హరిణడింభకములు, మాతాపితలు చెంతలేకుండిన కారణమునఁ గ్రూరవ్యాధులవలననో, మార్జాలములవలననో, భయమంది యాక్రోశమొనరించుచున్న చిన్న చిన్న పిట్టలధ్వనులు-ఆతనిపిత్రియాపత్యమును స్మరింపఁజేసినవి. తాను బయలుదేఱి వచ్చునపరికి బాహ్యప్రపంచమునే యెఱుంగక రోగగ్రస్తుఁడైయున్న చిన్నకుమారునిఁగూర్చి యాతని హృదయము తహతహలాడెను. ఆతని శాశ్వతసౌఖ్యమును గోరుచుండెను. తన కెట్టివిధమగు నపకారముతటస్థించినను, దుదకు మరణము సంభవించినను, దనదారాపుత్రులు సుఖముగానుండుటయే యాతని తలంపు. ఈవిధముగా మనసునం దెన్నియోవిషయముల వితర్కించుకొనుచు, సంసారమందలి మమకారమును వీడఁజాలక యున్మత్తునివలె నాద్వీపమంతయుఁ బరిభ్రమింపసాగెను.

మున్ను కుబేరశాపగ్రస్తుఁడగు యక్షునిఁబోలె యుక్తాయుక్త వివేకశూన్యుఁడై యొకపర్వతాగ్రమునకుఁబోయి, యాసవిూపమునుండి పోవు జలధరము నాలోకించి, స్వకీయక్షేమోదంతమును బ్రియురాలునకు విన్నవింపఁ బ్రార్థించును. మఱియు నొకసారి మెల్లమెల్లఁగవీచు మలయానిలు నవలోకించి కౌఁగిలించికొని, మిత్రకార్యంబు నెఱవేర్చుటకు నీవకాక యితరులు సమర్థులుగారు అని స్తుతిరూపముగాఁ బ్రోత్సాహించును. మఱియొకమారు హరిణాంగనను విలోకించి చూపులచేత నీకుఁ జెలిమికత్తెయగు నాభార్యచెంతకరిగి, నావృత్తాంతమును ఆమెకుఁ దెలిపి, యామెయుదంతమును దెలిపి నన్ను సంతోషపెట్టుము. అని బ్రతిమాలును ఈవిధముగ-చేతనములు—అచేతనములు-అను భేదమును బరిగణింపక గొందఱను బ్రతిమాలి, కొందఱభయపెట్టి, మఱికొంద ఱకుఁబ్రత్యుపకారము నాచరింతునని బాసచేసి,తనప్రేమను-తన హృద

యావేదమును-కొంత శాంతింపఁ జేసికొనుటకుఁ బ్రియత్నించెను. అచేతనములుసచేతనములై ననుసంభాషణా శక్తిశూన్యములగు వస్తువుల వలనఁ గార్యనిర్వహణము గాదనియాతఁడు తలంచియుండ లేదు. కామాంధులకు యుక్తాయుక్తవివేక లేశ్యముండఁగుగదా!

విరహవేదనాదోదూయమాన మానసుఁడై హృదయశాంతిని గోరుచు ప్రశాంతము-నిర్మలమునగు నాకసమువంక నొకసారిచూచుచు నాపత్నిపత్నీయతింగలి సౌందర్యము తన శూన్యనేత్రములకు గోచరింపకుం డుటంజేసి యసంతృప్తుఁడై, భయంకర తరంగఘోషసంయుతము, గంభీరము, వినీలమునగుసాగరమువంక నొకపర్యాయముఁ జూచుచు సంతసింపుచుఁ బిమ్మట వనమందలి ప్రకృతినిబరికించుచుఁ బశ్చాత్హృదయుఁడు గావున, నాపత్నిప్రకృతియందే లీనమగుచుఁ గాలముఁ బుచ్చుచుండెను. ఇట్లాదుర్భరమగు వేదన నభవించుచున్నను గృహామందలి యాశ యతనిని వీడిపోలేదు. అదృష్టవశమున మరలఁ దనగృహామునుజేరి కొందుననియు, భార్యాపుత్రాదులతో సౌఖ్యమందుదుననియుఁగష్టము లెల్లకాలము కాఁపురముండవనియు నాతనియభిప్రాయము. దైవప్రీతి కూల్యమున నాదీవియందుఁ జిక్కువడియెనేకాని, యదృష్టదినములు నాప్రాప్తించినవెనుక సౌఖ్యము లందఁగలఁడేమో? అతనికి హృదయ శాంతి చేకూరునేమో? ఎవరు చెప్పఁగలరు? అఘటన ఘటనాసమర్థుఁడగు సర్వేశ్వరుని విధానమెట్లున్నదో?

మాధవరావు బయలుదేఱుసరికి నాతని చిన్ని కుమారుఁడు దుర్భర వ్యాధిగ్రస్తుఁడై చెంతనున్న మాతనైనఁ గాంచలేని స్థితియందు న్నాడని చదివితిమి కదా? కమల, మాధవుఁడు పోయిన మార్గమువంకఁ గొంతసేపు చూచి గుండెను రాయిచేసికొని శాంతివహించి కుమారుని యొద్ద కరుదెంచెను. ఆమె నేత్రములనుండి యశ్రుజలములు జల జల రాలఁదొడంగెను. కుమారీ కుమారులు తలితండ్రుల విచారము ను

గాంచి, అందునను మాత నంతటి విచారసాగరమున ముంచి నిర్దయ
స్వాంతము, నరిగినపితనుగూర్చి నిరాశజెందిన తమ యాటపాటలఁ
గాలమును బుచ్చుచుఁ దమ్మునిరోగమునకై వగచుచున్నతల్లిని
దిగులుపడి సంతోష పెట్టుచుండిరి. రోగార్తుఁడగు నాబాలకుఁడు, వ్యాధి
యంతకంతకు నధికమగుచుండ దుర్భరమగుబాధ నుభవించుచుండెను.
కుమారునిబాధనుగాంచిన తల్లి యావేదనను వ్రాయుట శక్యమా?
ఇట్టి విషమపరిస్థితి యందు మాధవుఁడు దగ్గఱలేకుండుటవలన నామె
ధైర్యమప్పుడు చలించుచుండెను.

అర్ధరాత్రము. ప్రకృతియంతయు గంభీరముగను, నిశ్శబ్దముగను
వెలయుచుండెను. జగమంతయు నంధకార బంధురముగనుండి భయము
ను గొల్పుచుండెను. ఆ గ్రామమందలి వ్యక్తులందఱు సుఖదుఃఖములను
మఱచి, బీదవాఁడు భాగ్యవంతుఁడనుభేదములేక సమానముగానే సౌఖ్య
ము ననుభవించుచుండిరి. భాగ్యవంతుఁడు హంసతూలికా తల్పమున
శయనించినను, బీదవాఁడు కటికనేలను బరుఁడినను నిద్రాసౌఖ్యమందఱి
కిని సమానమే కదా? ప్రకృతి యంతయు నిశ్శబ్దముగా నున్న నాసమ
యమున వాయుసంచలనమువలన నిసుమంతధ్వని. తీతువపిట్టల
కూఁతలు. ఆ నిశారాజ్యమున కధిపతియగు నలూకరాజముయొక్క
భయంకరారావము తప్ప వేఱొకసవ్వడి లేదు.

ఆ సమయమందు నొకసామాన్యగృహమున మినుకు మినుకు
మని దీపము వెలుగుచుండెను. ఆ దీపపుఛాయను బాష్పపూరిత నేత్రము
లతో నొక యార్తయగు వనిత దీనాననముతో మంచముపైఁ బరుండి
మరణవేదన నదుచున్న కుమారునిఁ దదేకదృష్టితోఁ గాంచుచుండెను.
ఈవిషయమునే గమనింపక కుమార్తెయుఁ బెద్దకుమారుఁడును బరుండి
నిద్రించుచుండిరి. సమస్త ప్రాణికోటికి సౌఖ్యదాయకమగు నారాత్రి
యామాతా శిశువులకుఁ గాళరాత్రి యయ్యెను. తన్నొంటరిగ విడచి

దేశముగాని-ద్దేశమరిగిన భ ర్తృవత్తాంతమును స్మరించి, మరణయాతన ననుభవించుచు, బాహ్య ప్రపంచమునే యెఱుంగక పరుండియుండిన కుమారునిఁ గాంచియు నామె ధైర్యశృంఖలము తెగిపోయెను. ఆయర్ధ రాత్రమునందా మెయాలాపము నాలకించు వారుఁగూడ లేరు. కన్నీటిబిందు వును విడచు వారింతకుమున్నె లేరు ఆపదపై నాపదను రప్పించుట యీజగన్నాటకసూత్రధారునికృత్యముకాబోలు? ఆపదపై నాపము గాఁబోలు.

'అమ్మా! దాహ'మని యా చిన్ని కుమారుఁడు తల్లి నడిగెను. ఆమె వెంటనే గ్లాసుతో వేడి మంచినీటిని యాతని నోటికందిచ్చెను. ఆమంచినీటినిఁ ద్రాగుచు 'నాన్న లేఁడా' యని యాతఁడడిగెను. 'మీ నాయన గారిప్పుడే వత్తురు. పరుండుము నాయనా!' అని యామె యతని ననునయించెను. ఆతఁడు మనసులో నేదియో స్మరించుకొనుచు నేత్రములఁ, దోడనే తల్లికి నమస్కరించి, మూసెను.

ఇంకేమున్నది! ఆ పసినిసుంగు జీవనజ్యోతి- యారిపోయినది. ఎంతయోమంది వృద్ధులు తినఁ దిండిలేక, మలమల మాడుచు, మరణమును గోరుచుండ, నా భగవంతుని దృష్టి యీబాలకుని పైన పడవలయునా? ఆతఁడు దీనబాంధవుఁ డందురుగాని యదికల్ల-ప్రయాణమై పోవుచున్నప్పుడు తండ్రి త్వరలోనే శాశ్వతసౌఖ్యము నందఁగలఁడని పలికినపలుకుల కిదియాఫలితము? స్వర్గలోకమందు శాశ్వత సౌఖ్యము నందఁగలఁడు. నిజము. తండ్రిగారిమాట రిత్తయగునా? ఈవృత్తాంతమా మాధవునకుఁ దెలిసిన నాతఁడెంత పరితపించునో కదా?

అంధకారబంధురము, భయకరమునగు నా నిశీథమందు ననాథయగు కమల చిన్నికుమారుని కొఱకెంత వాపోయినదో తారకలకు- రేలతాంగికి-ఆమె హృదయమునకుఁ దక్క నితరులకుఁ దెలియదు. ఆమె నూరార్చు వారెవ్వరు? ప్రకృతియందే సౌందర్యము-క్రౌర్యము గూడ నుండుననని యనుభవశూన్యయగు నామె కేమి తెలియును? ఎంత విలపించిన నేమి:-ాభమని ధైర్యచిత్తయగు నామె హిందూధర్మము

ననుసరించి యాశవమును ఖననమునకై గోదావరీచెంతకుఁ దీసికొని పోయెను. వారల విచారముతో నగఁదెంచుచున్నప్పుడు "కమలా! ఎంతటి వెఱ్ఱిదానవు! మాధవుఁడు నీకు భర్తయా? నిన్నింతటి విపద్దశ పాలొనరించి తాను సౌఖ్యముగ నౌకాయాన మొనరింపనేగెను. ఇఁక మోసపోకుము-అంతటికష్టుని, నికృష్టుని భర్తగా నొనరించికొని నీవేమి సౌఖ్యమందఁగలవు? అని యెచ్చట నుండియో మాటలరుదెంచినవి. ఆమాటలను విని యామె తెల్లఁబోయినది. వెనుదిరిగి చూచినది. అంధకారము—శూన్యప్రదేశము—గోదావరి—శ్మశానము—ఆ మాటలందలి సత్యాసత్యములను విమర్శించుకొనుచు నింటికిఁబోయి కుమారీ కుమారులఁ బ్రేమముతోఁ జూచుకొనుచుండెను. భర్తృవృత్తాంతమే తెలియక పోవుటవలన నాతనిని దలచుకొనినపుడు దీర్ఘనిశ్వాసమును వెలిఁబుచ్చుచుండెను.

దారిద్ర్యము.

మాధవుఁడింటినుండి యరిగి సుమారు మూఁడు నాలుగు, వత్సరములు కాఁజొచ్చినది. కాలచక్రమిట్లు తిరిగివచ్చుచుండును. ఆకాలమే సుఖవంతులకు నిమిషముగను, కష్టభాజనులకు మహాయుగములుగను దోఁచుచుండును. కమల కుమారుఁడు చనిపోయిన కొంతకాలమువఱకు నాతనియందలిప్రేమచే విచారించెను. భర్తయొక్క వృత్తాంతమేమియుఁ

తెలియకపోవుట శోకమినుమడియగుచుండ విహ్వలచిత్తయై వాపోవుచుండఁగుమారీకుమారులు లరుదెంచి "అమ్మా! ఏడ్చుచుంటివేలనమ్మా!" యని యడుగుచుండఁ దనదుఃఖము నుపశమింపఁజేసికొని వారిరువురును జూచి సంతోషించుచుండెడిది. ఆకుమారీ కుమారులొక వత్సరము వఱకుఁదండ్రినిఁ గూర్చితల్లినడుగుచుండెడివారు గాని యావృత్తాంతము వలన నామె కన్నులనుండి నీరుగారుచుండుటవలన నిఁకముందెన్నఁడుఁ దమతండ్రినిఁగూర్చి యితరులనుగాని మాతనుగాని ప్రశ్నించువారు గారు. వారిప్పుడు పూర్తిగాఁ బితృవృత్తాంతమునే విస్మరించిరి.

కమల కనేకులు ననేకవిధములుగా మాధవునిఁగూర్చి చెప్పుచుండెడివారు. నౌకయందరుగుచుండఁగా నయ్యది సాగరమధ్యమున మునిఁగిపోయినదనియు, ద్వీపాంతరము నందధికముగ ధనమును సంపాదించుచుండెననియు, సంసారమునురోసి విరాగియై సంచరించుచుండెననియుఁ, గొన్నిదినములలో నరుదెంచెదనని నాతోఁ జెప్పెననియు, నీవిధముగాఁ బలుకుచుండ నామెకు- అబలకు నిశ్చయజ్ఞానము లేకుండెను. కాని భర్త తప్పక రాఁగలఁడను ధైర్యమును మాత్రమామె వీడలేదు. మాధవుఁడుబయలుదేఱి పోవునప్పుడింటియొద్దఁగొంతధనమునుంచి యా ధనమువలన గౌరవముగా సంసారము నడపింపుమని భార్యతోఁ జెప్పెను. ఆధనమంతయుఁ గుప్తముగా వాడుచుండిన కమలచేతిలో నుండి రెండు వత్సరములలో జారిపోయెను. పిమ్మట నాత్మగౌరవమును నిలఁబెట్టుకొనుటకై యొకభాగ్యవంతుని భార్యయొద్దఁ గొంతధనమును తనభర్త యరుదెంచినపిమ్మట నిత్తునని బాసఁచేసి దానివలన సంసారమును గడపసాగెను. అయ్యదియు నశించినది. పిమ్మట-పిల్లలకుమాత్రమన్నమిడుచుఁ దా నుపవసించుచు భర్త వచ్చినచోఁ దనకష్టములు గట్టెక్కఁగలవని తలంచుచు వానిరాకకై యెదురుచూచుచుండెను. తన కష్టములొరులతోఁ జెప్పికొన్నఁ గొంతశమించునేమో యని తలంచుచుఁ

కాని యాభిజాత్యమువలనఁ దనసంసార రహస్యముల నితరులతోఁ జెప్ప నిశ్చయించుకొనెను. 'ఎప్పటికైన మాధవుఁడరుదెంచిన సుఖంతము. లేనిచో నుపవాసముల శరీరముచు శుష్కింపఁజేసి మరణింతము. అప్పటికి నీ ప్రాణ మీ శరీరమును వీడకున్నఁ బావనియగు గోదావరీతల్లియే నన్ను భరింపఁగలదు. నన్ను దరిఁజేర్చుకొనఁగలదు.'' అని యామె నిశ్చితాభిప్రాయము. హిందూనారీమణుల కుండవలసిన సదభిప్రాయ మట్టిదియేకదా?

''మాధవుఁడు దయాదాక్షిణ్యములు లేనికూరరాక్షసుఁడా? లేక మానవుఁడా? అతనియందు మానవత్వ మేమైనయున్న నిన్నింత కాలము విడచి నీ యోగక్షేమము లారయక నివసింపఁగలఁడా? శాశ్వతముగ నిన్ను దన మానసమందు స్మరించుచుందునని బాసచేసెనుగదా? ఆ బాస నాతఁడు విస్మరించి యుండెనా? అట్లు విస్మరింపక పోయినను, నిర్ధనుఁడు భార్యయందుఁ గాని సంతాన మందుఁగాని దృష్టిలేని యా వ్యక్తి నీకేమి యుపకార మాచరింపఁగలఁడు? ఎంతకాలమీ విరహవేదన ననుభవింపఁగలవు? ఉపవాసవ్రతముల నీయాత్మ నలయింపకుము. సుఖంచుకుఁ బ్రయత్నింపుము'' అని యామె యంతరాత్మ ప్రబోధింప మఱల నా వాక్యములనే స్మరించినది. తలయూఁచినది. అందుసత్యము లేకపోలేదని యామె యూహాకాఁబోలు.

గృహయజమాని లేకపోయినచో నా సంసారమంతయు నల్లరియగుటయేకాక నలుగురి దృష్టిపథమునఁ బడును. కమల యొక్క కుమార్తెకిపుడు పదివత్సరములు, కుమారునికి ఏఁడువత్సరములు. విద్యాబుద్ధులు జెప్పించుటకు నాథుఁడులేకపోవుటవలన నాబాలికా బాలురు విద్యాగంధవిహీనులై చినిఁగిపోయిన మలినాంబరములధరించి వీధుల వెంబడితిరుగుచుండిరి. కమల నెద్దానినో యాలోచించుచు వీధిగుమ్మమున కానుకొని నిలుచుండెను. వీధివెంటనెవ్వరో యేగుచు నాపిల్లలఁ

గాంచి దయాంతరంగులు రెండురూకలనిచ్చిరి. ఆరూకలను వారుతల్లి కియ్యఁబోయిరి. ఆమెకన్ను లరుణములయ్యెను. పిల్లలవంకఁ దేరిపాఱఁ జూచినది. ఇది యెక్కడనుండి తెచ్చిరని యామె ప్రశ్నింప వెనుదిరిగి నడచుచున్న యొకవ్యక్తినిఁజూపి యాతఁడొసంగెనని చెప్పిరి. ఆవ్యక్తిని గమనపరిశీలించి చూచినది. ముఖము కనఁబడలేదు. నడకమాత్ర మిది వఱకెన్నఁడో చూచియున్నట్లు తెలిసికొనినది. తనయాభిజాత్యమునకు, ఆత్మగౌరవమునకు భంగకరమగు నాధనస్వీకారమును సైపఁజాలక పసి పిల్లలను దయనువిడచి ముందెన్నఁడైన నాయాజ్ఞలేనిదే మీరితరులనుండి యేవస్తువును స్వీకరింపరుగదా? యనికఠినముగ శిక్షించెను. ఆరెండు రూకలను బిచ్చగానికిఁధర్మముచేసెను. బిచ్చగాఁడాధనమును బ్రతిగ్ర హించుచుండ దూరమునుండి చూచుచున్నయొకవ్యక్తి యాశ్చర్య మందె కమలయొక్క యాత్మవిశ్వాసమునకు, పరధనమందునిర్లక్ష్యతకు సంతసించెను.

కమల కడుపారభుజించి నేటికెన్ని దినములైనదో? దినములే కాదు-మాసములు-సంవత్సరములుగూడఁ గడచినవి. పిల్లలుగూడ నుప వాసములు చేయవలసిన పాడుదివసములు ప్రాప్తించినవి. కమలకుఁ గర్తవ్యమేమియు బోధపడుటలేదు. పిల్లలు "అమ్మా! అన్నమే" యని యాయబలను అనాథను వేధింపఁదొడఁగిరి. ఆమె యాశలన్నియు నడు గంటినవి. ఇట్లింక రెండు మూఁడుదివసము లన్నమిడకపోయినను దుర్బల ప్రాణులగు నాపిల్లలుగూడ బ్రతకరేమోయని యామెకధైర్యము తోఁచి నది. మాధవుడింకరాఁడు. ఆతఁడు నాభర్తగాఁడు. భర్తృశబ్దవాచ్యుఁడు మున్నే కాఁడు. నిర్దయస్వాంతుఁడు. ఇతఁడు యథార్థముగ బ్రతికియుం డెనా? లేకమరణించియుండునా? బ్రతికియున్నచో నెట్లైన యరుదెంచి ప్రియవనితనగు నన్నుఁ బ్రియాపత్యమును ఆదరింపకనుండునా? ఆకలిచే గిల్లాడుచు నన్నమోరామచంద్రా యనిబాధపడు నాసంతానము నేమి

సేయఁగలను? అబలను-విద్యావతినైనను ధనార్జనకొఱకు వేఱొక చింత కరిగిన లోకులూరకొందురా? మాధవుఁడొకవేళ మరణించియుండిన నా కర్తవ్యమేమి? ధనశూన్యను, యౌవనవతినియగు నేనేమికావలయును? ఎవరిచెంత కరుగవలయును? తల్లియా? తండ్రియా? అత్తయా? మామయా? ఎవరున్నారు? అప్పులు అనుమాట నుచ్చరించుటకైనను యోగ్యురాలను గాదే? దైవమా! నాకిట్టియవస్థ తటస్థింపఁజేసితివి? నేనొకవేళ మరణము నాశించినను నాసంతానముగతియేమి? భావికాలమునవృద్ధిలోనికిరావల సినసంతానమును మరణశయ్యపైఁ జేతులారఁ బరుండఁబెట్టనా? యని యాలోచించుచు విచారమున నొడలు తెలియక వాపోవుచుండెను

పాఠకులారా! దామోదరరావు వృత్తాంతమునుఁ బూర్తిగ మఱచితిరా? అతఁడు మహాధనవంతుఁడు. నా దుర్భాగ్యవశమునఁ గమలా మాధవులను గాంచినప్పటినుండియు నేఁటికి రెండుదినములుముందు వఱకు మఱలఁ గమలను గాంచలేదు. కమలాప్రణయమును గోరి యుండ నామె యితరుని వివాహమాడుటవలన నామెయందలి ప్రేమను మఱల్చుకొనవలసిన వారయ్యెను. అతఁడట్లు మఱల్చుకొనక తనయౌవ నమును గమలకే యర్పింపవలయునను ధృఢసంకల్పముతో నేఁటివఱకు బ్రహ్మచారిగానేయుండెను. తానేదియో పనిమీఁదఁ గమలయింటి ముందునుండిపోవుచుగుమ్మమున కూనుకొని, నిలచియున్నకమలనుఁజూచి యాశ్చర్యపడెను. నవనవలాడు మరాకాసుధాకరునిఁగేరు ముఖమండలము శోభావిహీనమైయుండుటనుగాంచి విచారించెను. పోలికనుబట్టి యీనాఁ వాలుపట్టిఁ యాటలాడుకొనుచున్న పిల్లలకు రెండురూపాయలనిచ్చెను. అనంతరముజరిగినకృత్యము నాతఁడు కనులారఁగాంచెను.

మాధవుఁడు గ్రామాంతరమున కేగి రాలేదనియు నాతనిచిన్ని కుమారుడింట లేనప్పుడు మరణించెననియు దామోదరునకుఁ దెలిసినది గమల అన్నహారములులేక న్నుపవాసములు చేయుచున్నదనియు పిల్లలు

విద్యాబుద్ధులు లేక సోమరులగు చున్నారనియు నాతనికింతవఱకుఁ దెలియదు. అట్లుఁ దెలిసియున్నచో దయాస్వభావుఁడగు నాదామోదరుఁడు కమలకేదియో యుపకారమాచరించియుండును. ఆ నాఁడు దయమున దుస్తులనువెదికొని కమలకుఁ గొంతసహాయముచేసి యామెదుఃఖమును మాన్పవలయునని సంకల్పించుకొని కమలా గృహమునకు బయలుదేఱెను.

అంతకుఁ బూర్వదివసమునఁ గమలకుఁగాని పిల్లలకుఁగాని యన్నము లేదు. మాడుచున్న కడుపులతోడనే వారా దినమును గడపిరి. ఈ సంగతిని విని పొరుగింట దయార్ద్రచిత్త కొంత యన్నమును దీసికొనివచ్చి కమల వలదనుచున్నను వారింటియందుఁ బెట్టి వెడలిపోయెను. కమల యా యన్నమును జూచి కన్నీటినివిడిచి యాఁకలిచే నల్లాడుచున్నపిల్లలకు ముందుపెట్టి తరువాతఁ దాను భుజించు నూహతో వారల కన్నముఁబెట్టి వారితో సంతోషకరములగు మాటలను జెప్పుచుఁ దాను సంతోషించుచుండెను. చాలకాలము నుండి మాతకు దుఃఖకరమగు పితృవృత్తాంతమును స్మరింపని వారిరువురు నొకే పర్యాయము "అమ్మా! నాన్నగారెప్పుడు వత్తురే?" యని" యడిగిరి. ఆప్రశ్నకిదివఱకు వలెఁగాక కమలయుఁ జిఱునవ్వుతో "నమ్మా! యిప్పుడే యరుదెంతురు. కడుపునిండ భుజింపుము నాయనా! నీవుకూడఁ దినుమని" యుత్సాహముగఁ బలికెను. సరిగ నీ సమయమునకే దామోదరుఁడు తలుపుతెఱచి యింటియందుఁ బ్రవేశించి, కమలా! క్షమింపుము నీ యానతిలేనిదే గృహమునందుఁ బ్రవేశించితిని. 'క్షేమముగ నున్నావా!' యని ప్రశ్నించెను. ఆ మాటలకు సమాధానము చెప్పుట తేలికయైనను నోటినుండి మాటవెలువడ లేదు. ధైర్యమునవలంభించి 'క్షేమముగనేయున్నాను. మీమిత్రులింకను రాలేదు. నాకేమియుఁ దోఁచుటలేదు' అని పలికెను. 'కమలా! భయ

పడకుము. నీనాథుఁడు తప్పక రాఁగలఁడు. నేనొక సహాయ మొసంగెదను. దాని ననుసరించి నీవు తప్పక ప్రవర్తింతువా! దానివలనఁ గలిగిన లాభములు గలవు. నీ సంతానము విద్యాబుద్ధులు లేక పాడగుచుండిరి. నీవు గూడ దారిద్ర్యమున బాధపడుచుంటివని గ్రహించితిని. కావున నేను గొంతధన మొసంగెద. దానితో యోగ్యముగ సంసారమును గడపుకొను చుండుము' అని పలికెను. అంత నామె, 'మిత్రమా! నీ యుదారబుద్ధికి సంతసించితిని. ప్రాణములను విడచుటకైనను సిద్ధపడుదునుగాని యొరులనుండి యుచితముగ ధనమును స్వీకరించి నాయాత్మగౌరవమును భంగపఱచుకొనఁజాలను, క్షమింపుము.'

'కమలా! ఇట్టిక్లిష్ట పరిస్థితియందు నావలన ధనమును స్వీకరించుట నీ యాభిజాత్యమునకు లోటుగాదు. నన్ను గూడ మాధవునితో సమానునిగ నెంచి నాధనమును స్వీకరింపుము. లేనిచో నీభర్త వచ్చిన పిమ్మట నాధనమును నాకొసంగుము, అంతియేగాని నీయాత్మను దుఃఖింపఁ జేసికొనకుము, నీపిల్లలకు విద్యాబుద్ధులనఁ జెప్పింపుము.' అని యామెకు నూరురూకల నొసంగి మఱలవత్తును. పోయివచ్చెద నన 'మిత్రమా! తఱచు నీవు వచ్చి మమ్ములనుఁజూచి పోవుచుండవలయును. నాకాప్తులెవరును లేరని నీవెఱుంగుదువు కదా'? దామోదరునిఁజూచి, యయమాలగుఁ బిల్ల లంతకుఁబూర్వము తల్లిమాట ననుసరించి యాతఁడే తమతండ్రి యని భావించి యాతని చెంతకరిగిరి. ఆతఁడు వారల నిద్దరను చేరియొక ముద్దుచే బహూకరించి వెడలిపోయెను, కమల యాతని యవ్యాజానురాగమునకు సంతసించి మనసునందుఁ బలుమారులు గొనియాడెను.

వర్షములు మిక్కుటముగాఁ గురియుచుండుటవలనఁ జాల రోజులనుండి సంస్కారశూన్యముగఁ గమలవసించు గృహము శిథిలమాయెను. దామోదరుఁడిచ్చిన ద్రవ్యము బట్టలకొఱకుఁ గొంత,

భోజనముకొఱకుఁ గొంతఖర్చుయ్యెను. దామోదరుఁ డప్పుడప్పుడుఁ గమలను బరామర్శించి యోగక్షేమములనారసి పోవుచుండెడివాఁడు. నాఁడు శిథిలమగుచు నందునివసించువారికిఁ బ్రాణాపాయకరమగు గృహమును బరిశీలించి "కమలా! ఈగృహమందు వసించుట పొరబాటు. ఇప్పుడే భవనమునుబాగుచేయించుటకు వర్షములాటంకముగా నుండును. కావునఁ గొంతకాలమువఱకు మాగృహముననుండుమని యామెను బలవంతపెట్టెను.

తన యుదంతమునువిని యుపకారమును జేయకుండుటయే కాక నిశ్వాసమును వెలువడనీయని యట్టిపరిస్థితులలోఁ గమలకా మాటలు సంతోషదాయకములైనను, బరునిగృహమున వసించుటతన యాభిజాత్యమునకుఁ గళంకమనితలఁచి యామెమొదట నిష్టపడకుండినను, వర్షకాలమున నాయింటనుండుట తనకు, తనసంతానమునకు నపాయకరమని తలంచి యెట్టకేలకియ్యకొనెను. ఇంతవఱకుఁ గమలమనసునందు మాధవుఁడు గన్పట్టుచునే యున్నాఁడు. అతనిని బ్రతిదినము స్మరించుచునేయున్నది. అతనియాగమనమును గోరుచునేయున్నది. కాని, యాతఁడువచ్చుజాడలేమియు నాయబలకు గోచరించుటలేదు. అతఁడుకేవలము కృతఘ్నుఁడనియు, నాతనిమాట లంతవిశ్వాసయుక్తములు గావనియు నప్పుడప్పుడు తలంచుచున్నది. దామోదరుని బలవంతమువలన స్వగృహమునువీడి పరగృహము ప్రవేశింపవలసి వచ్చినది. మాధవుని వివాహము చేసికొనుటవలన నిట్టియిక్కట్టులకుఁ బాల్పడవలసి వచ్చినది. దామోదరుని యింటఁబ్రవేశించుట వర్షములకు భయపడికాని, యితరమగు నూహలుగాని, నిశ్చయముగాని, యామె హృదయమందుఁ గానరాదు.

పునర్వివాహము.

సమస్తప్రాణికోటులకు నాలవాలమై, సమస్తప్రాణులకు జీవనోపాధికమువగు నీప్రపంచము నందొకవ్యక్తికి చావులేదు. నాఁడందఱి తలలోను నాల్కయై ప్రవర్తించు మాధవుని నేఁడుస్మరించువారైనను మచ్చునకుఁ గూడఁ గానరారు. తనయాత్మపత్ని-సహధర్మచారిణియగు కమలకూడ మాధవునిఁ బూర్తిగ మఱచిపోయినది. తన ప్రియాపత్యము నింతకుమున్నే విస్మరించినది. కాలగర్భమున గ్రంథరాజములు, శాసనములు మాటువడియుండునుగాని, మానవులు సంపూర్ణముగ విస్మృతినందుటయాశ్చర్యము. విధి విధానమువలన మనుష్యులుగూడ విస్మృతినంది యున్నవారు గలరేమో!

కమల దామోదరునియింట సుఖముగఁగాలమునుఁ బుచ్చుచున్నది. తన గృహము మాటమఱచి దామోదరునిగృహమే తనగృహముగ భావించుచున్నది. దామోదరునిజూచుచున్న కొన్నాళ్ళనుండియు నామెభావము వేఱువిధముగనున్నది. ఒకదివసమున దామోదరుఁడు కమలనుఁ బిల్చి 'కమలా! నిన్నొకమాట యడుగవలయును. కూర్చుండుము. మనము చదువుకొన్నప్పటిసంగతులు నీజ్ఞప్తియందున్నవా? నీవొకమారు స్త్రీ పునర్వివాహమునుఁగూర్చి యుపన్యసించితివి. స్త్రీ పునర్వివాహమును జేసికొనుటవలన దోషములేదనియు, అట్లువివాహము చేసికొనక పోయినచో నైతికవర్తనమునకు భంగమనియు గంభీరముగమాట్లాడితివి. ఆయభిప్రాయమును దరువాతమార్చుకొంటివా?'

'లేదు. నేనట్లుమార్చుకొనుదానను గూడఁ గాను. నాఁడేకాదు. నేఁడైనను స్త్రీపునర్వివాహ మత్యావశ్యకమనియే నాయభిప్రాయము.

'కమలా! కోపింపకుము. నీకొక సలహానొసంగుచుంటిని. నీభర్తృ వృత్తాంతమేమియుఁ దెలియక-ఆభిజాత్యమువలన నెంతైనయరిగి సంసారమును గడపుకొనుట దుస్సాధ్యముగానుండ-నీవు పునర్వివాహ మాచరించుకొనినఁ దప్పేమి?'

'...లోకు లూరకొందురా?'

'కమలా! లోకులుగాకులు. వారికి యుక్తాయుక్త వివేకములుండవు. ఎవరైన నేవియో మాటలనుఁజెప్ప దానినే యథార్థమందురు. కాని, న్యాయాన్యాయముల పమర్శింపఁబూనరు. దున్నపోతు యీనిన దన్న దూడనుగట్టుఁ డనుటయేకాని దున్న పోతు ఈనునా? యనుజ్ఞానము లేదు. సంఘ మున్న తస్థితిలోనికి రావలయునన్న, సంఘీయులను బ్రోత్సాహముచేసి వారికార్యములకుఁ దగుసదుపాయముల నాచరింపలయును. కాని, వారల నధఃపతితులను గావించి నిరుత్సాహపఱచినఁ దమకువచ్చు గౌరవమునుమాత్రము స్మరింపరు. కావున సంఘమునకు వెఱచి యీ కాలమందు నీయభిప్రాయములను మార్చుకొన నవసరములేదు.'

'...నాభర్త మఱల నరుదెంచునేమో యనునాశ యిప్పుడప్పుడు పీడించుచుండును.'

'కమలా! ఇంకనునీకాతఁడు భర్తయా? ఏనాడునిన్ను దురంతచింతాసాగరము నముంచి, వ్యాధిగ్రస్తుఁడు, మరణావస్థనున్న కుమారుని విడిచి యరిగెనో, యానాఁడే నీకును, అతనికిని దాంపత్యము నశించినది. అదియుఁగాక నాతఁడింకను బ్రతికియుండినచో.'

"నష్టేమృతేప్రవ్రజితేక్లీ బేచపతితేపతౌ- అను ధర్మశాస్త్రము ననుసరించి నీకుఁబూర్వము పతియగుమాధవుఁడు మరణించినను, ప్రవ్రజితుఁడైనను నీవుమఱల వివాహము నాచరించుకొనవచ్చును. శాస్త్ర విరుద్ధముగాదు. మఱియు, నాగరికత, విద్యాగంధముగలనీవు, పసలేని ప్రాచీనాభిప్రాయముల నవలంభించుటతగదు.'

'దామోదరా! అట్లైన నాకుఁ గొంతయవకాశమిమ్ము. తరువాత నా నిశ్చితాభిప్రాయమును నీకెఱింగింతును. పిమ్మట నీయిచ్చవచ్చినట్లు జేయవచ్చును.'

ఆనాటిఁరేయిఁ గమలకు నిద్దురపట్టలేదు. హృదయమున నాలోచనా పరంపరలెన్నియో పొంగిపొరలి ప్రవహింపసాగినవి. కేవలమగ్ని పరీక్షయే యామెకుఁ దటస్థించినది. వలచి వలపింపఁజేసి హృదయమును జూఱఁగొని యిప్పుడుమాటువడియున్న మాధవుఁడు ఆతనిపరిస్థితి-యొక వంకను, వేఱొకవంకను దామోదరుని యుచితమగుసలహా. దేశకాల పరిస్థితులననుసరించి యనుసరణీయము. 'మాధవుఁడు మరణించియుండె ననుకొన్నను నేను పునర్వివాహ మాచరించుకొనుట యాతనికిసంతోష దాయకమా? ఆత్మశాంతికరమా? తప్పకఁఆత్మ శాంతికరమే యగుఁగాక. ఆఁతడు మనోవాక్కాయ కర్మలను నాసౌఖ్యమునే కోరుచుండును. నాసౌఖ్యముకొఱకే పాటుబడుచుండును. ఈకార్యముగూడ నాకు సౌఖ్యదాయకమే! కావున, నతఁడేల యంగీకరింపడు. తానింటలేనప్పుడు దుర్భరదారిద్ర్యమును భరింపఁజాలక సంతానమును బోషింపఁజాలక యుచితమగు మార్గమునవలంభించి యాత్మగౌరవమునుగాపాడుకొనినది. యౌవనవతినగు నేను—విషయవాంఛలు పూర్తిగాఁదీరనినేను—దారిద్ర్యమనుభవింపఁజాలనినేను-దుర్వ్యసనములకు లోనుగాక యుచితమార్గమున నుత్తముఁడగు వరుని బునర్వివాహమాచరించుకొనుట మాధవునకేకాదు పంచమహాభూతములకును, బ్రపంచపరిస్థితులు గమనించినవారికినిగూడ యుక్తమనిపింపకపోదు. కావున,నీయభిప్రాయమును దామోదరుని కెఱింగింతుఁగాక'యని తలంచుచున్నంతలో నగ్గలమగుదమకము నాపఁలేక దామోదరుఁడటకే యరుదెంచి కమలఁనుగాంచి యీవిధముగాఁ బల్కెను.

కమలా! నేఁటికి పదివత్సరముల పూర్వపుసంగతులను స్మరింపుము. మనమిర్వురము నెట్లు నవఁగి పెనఁగి స్నేహమునఁ బవ ర్తించెడివారమో? నాఁటినుండి నేఁటివఱకు నట్టిస్నేహమునే యభిలషించి నీకొఱకు నేను బ్రహ్మచర్యము నవలంబించి నీప్రేమభిక్షనర్థించి యసువులభరించి యుంటిని. నాఁడు నాయందునీకుఁ బ్రేమగలదని యితరములగుఁ గార ణములవలనఁ దెలిసికొన్నను లజ్జాతిరేకమునను, నన్నుగాక యన్యుని నీవు వివాహమాడవను తలంపునను నా నిశ్చితాభిప్రాయమును నీకెఱిం గింపలేదు.

దామోదరా! గతమందలి సంగతులేలః నాఁడు నీయందు నాకుఁ బ్రేమజనింపకపోలేదు. భాగ్యవంతుఁడవగు నీవు నన్ను వివాహమాడ వేమో యనుతలంపునను, నీయభిప్రాయమును దెలిసికొనక పోవుట వలనను మాధవుడే నన్ను ముందుగాఁ గోరుటవలన నాతనికే యప్పటి నుండియుఁ బత్నినైతిని. ఇప్పుడాతఁడు నాభర్తగాఁడు. నేనాతనిభార్యను గూడకాను.

కమలా! (Love is blind) ప్రేమకు నైశ్వర్య దారిద్ర్యముల భేదములుగలవా? సార్వభౌముఁడుకూడ సామాన్యవనితను బెండ్లి యాడ సమస్తసామ్రాజ్యమును బరిత్యజించు మండెనుగదా? ఐశ్వర్య మత్తుఁడనై ప్రేమించి నిన్ను విడనాడుదునా? ఇన్నాళ్ళనుండియు నన్నిం, పరితాపసాగరమున ముంచితివిగదా? ఇకనైనను నన్నుగ్రహింపుము. ఇంతియగాదు. మున్ను మనముమువ్వురము నాడుకొనుచున్నప్పుడు నాకును మాధవునకును వివాదమేర్పడ నీవొకతీర్పును జెప్పితివిగదా? జ్ఞాపకమున్నదా?

లేకేమి. ఏదో బాల్యచాపల్యమున నంటినేమో?

...అయ్యది బాల్యచాపల్యమునఁ బలికినపలుకుగాదు. నన్నింత వఱకుఁ బ్రతికించుటకు భగవంతుఁడు నీనోటినుండి వెలువడఁజేసిన యమృతకిరణము. ఆయమృతము నే సేవించి నేనింతవఱకును మృతుఁడను గాలేదు. పవిత్రమైనవారినోటినుండి ననర్థకములగు మాటలు వెలువడవు. "ఋషీణాం పునరాద్యానాం వాచమర్థో ఽనుధావతి." నాఁడు నీవు పవిత్రభావయుక్తవు గావున, ఋషితుల్యవే. నీమాట సార్థకముగాకఁ తప్పదు. నన్ను నీదాసునిగఁ జేసికొని నాగృహయజమానురాలవై స్వేచ్ఛగ నేలుకొమ్మ. నేను నిన్నిప్పుడు బలాత్కార మాచరించుట లేదు. హృదయపూర్వకముగాఁ బ్రేమించి ప్రేమింపఁజేసికొనుటయే నా యభిమతముగాని పాశవశృంగారమునకుఁ బాల్పడుట నాయభిమతము గాదు. నీకింకను నవకాశమిచ్చితిని. నాహృద్గతాభిప్రాయమును మఱుఁగు వెట్టక నీయెదుటఁ జెప్పవచ్చితి నాలోచించికొనుము. నీసంతానమును నాకన్నసంతానమువలెనే కాంచెదను. వారల కేవిధమగు నపాయము రాదు. నేఁబోయివచ్చెదనని దామోదరుఁడు నెత్తినుండి భారమును దింపి కొనినకూలివానివలెఁ దనగదిలోనికిఁ బోయి హాయిగ నిద్రించెను. కమల కూడఁ గొంతతడవాలోచించి నిశ్చయపఱచుకొని నిదురించెను.

మానవస్వభావ మతిచంచలమైనది. క్షణక్షణము భావములు మాఱుచుండును. అటుమాఱుట సహజము. ఇంద్రియనిగ్రహము ప్రతి వారలకు సాధ్యముగాదు. మునీంద్రులకే యింద్రియనిగ్రహము దుస్సాధ్యము. అట్టితరి మానవునిమాట వేఱ చెప్పనేల? మహాప్రవాహము నందలిబుద్బుదములవలె మానవుని మనసునందుఁ గూడ భావపరంపర లావిర్భవించి నశించి లీనమగుచు మఱల మఱలఁ బుట్టుచుండును. ఒకప్పుడు మాధవుని మనసార వలచిన కమల యిప్పుడు దామోదరుని వలచినది, అతనిని ప్రియా! అని సంబోధించిననోటితోడనే యిప్పుడు

దామోదరునిఁ బ్రియా! అనిసంభోధించుచున్నది. మాధవునితో విహరించిన యారామములందు ఆసీనయై సౌఖ్యమనుభవించిన వేడుకలయందుఁ దానిప్పుడు దామోదరునితో విహరింపుచు సౌఖ్యమందుచున్నది. మనశ్శల్యభూతనగు మాధవుని మనసునుండి పెకిలివైచినదే. ఆమె యిప్పుడు దామోదరుని గృహమునకు యజమానురాలు. దామోదరుని సహధర్మచారిణి. అతః మనసునకు నచ్చునట్లువర్తించుచు నా గృహమున కలంకారభూతయై వెలుఁగందుచున్నది. దామోదరుని యసిధారావ్రతమగు బ్రహ్మచర్యముపోయి గార్హస్థ్యము పైవానుకూల్యమునఁ దటస్థించినది. కమలయే తనధర్మపత్నియౌటకంటె నాతనికి వేఱగు నభిమతముగానరాదు. ఆతని సంతోషమునకునుత్సాహమునకుఁ బారములేదు. వారట్లు పొంగిపొరలి ప్రవహించెడి ప్రేమవాహినియందు దలమునుకలుగ స్నానమాచరింప వారిప్రేమకు ఫలితముగ నొకసుపుత్రుఁడుగూడ నుదయించెను. కమలకుఁ బూర్వస్మృతియేలేదు. అది దుఃఖభాజనమగు సంసారము. ఇయ్యది సంతోషకరము. ఉత్సాహదాయకము. దానికిని దీనికిని హస్తిమశకాంతరమున్నది.

"కమలా! నీప్రేమశాశ్వతముగాదు. బుద్బుదప్రాయము. ఒక సమయమున నిన్నువలచి సర్వస్వమునీవేయని భావించి నీసౌఖ్యమునకై పాటుబడుమాధవుని సంపూర్ణముగ విస్మరించితివి. శాశ్వతముగఁ దన మనసున నిన్నునెలకొల్పి పూజించుకొనుచున్నాను. ఆతనినిమాత్రము నీవుపూజింపవైతివి. నీవిప్పుడు కేవలమైశ్వర్యమునే కాంక్షించితివి కాని ప్రేమను కాంక్షింపలేదు. లేకున్నచో దామోదరునిఁ గోరవు. మాధవుని విస్మరింపవు. నీయభిప్రాయమును గుర్తెఱింగి దామోదరుఁడు నిన్నుఁజేరఁదీసెనేకాని లేనిచో నిన్నుగన్నెత్తి కాంచఁగలరా? అగ్నిజ్వాలనైననంటుటకు సాహసించునుగాని నిన్నంటుటకు సాహసించునా

నీకుఁ బునర్వివాహ మాచరించుకొన నూహవొడమినచో మాధవుని వివరములు తెలిసికొనకయే నీవట్లాచరించుటతగదు. అతఁడొకవేళ యదృష్టవశమున బ్రతికియుండి నీకనులకగపడిన నీ వేమిచేయఁగలవు?'' అని యామె యంతరాత్మ యొకకాలమునఁ బలికినపలుకుల నామె లక్ష్యము సేయలేదు. కమలమనోధైర్యమునకు నాత్మవిశ్వాసమునకుఁ గారణమేమో?

ఆగమనము.

మానవసంచారము లేక, తన విషాదయుక్తజీవితమునాలించి యున్న బాష్పబిందువులనైనను దాల్చువారు లేక, బావురుమనియేడ్చి తన పరితాపమును బాపుకొనుటకు శక్తి లేక, హృదయశాంతి యంతకుమున్నే లేక శోకదివారాలను గూడ విడనాడి యాదీవియందు మాధవుండు పరిభ్రమించుచు దారి తెన్నును గానక, దారాపుత్రులయందు మమకారమును వీడంజాలక, అసువులంబాయుటకు ధైర్యములందక ప్రాణరక్షణతత్పరుండై గృహమునుజేరు తమకమున నుత్సాహముతో మార్గము నన్వేషింపుచుండెను

ఇట్లుండనాతని యదృష్టవశమున నొకయోడ మారమునంగాన్పించెను. ఆతనికిం బోయినప్రాణములు మఱలనరుదెంచినవి. నశించినయాశలు తిరిగి మొలకెత్తసాగినవి. ఒక పర్వతాగ్రమున కెక్కి తనపైనున్నవస్త్రమున భయంకరముగ నోడలోనివారందఱు వినునట్లు పెద్దకేకవైచెను. దయార్ద్రహృదయులగు నానావికులందఱు నానిర్భాగ్యునిం దిలకించి యాతనిని దీసికొనివచ్చుటకై చుట్టుకుం బోయిరి. మెల్లగ నాతం డోడనెక్కి వారలనందఱను దేఱిపాఱం జూచెను. కొన్నివత్సరములనుండి మనుష్యదర్శన మాచరింపని యాతనికన్నులకు వారందఱు విపరీతవ్యక్తులుగం గాన్పించిరి. వారేదియోయనిం బ్రశ్నవేసినచో నద్దానికిం బిశాచభాషయందు సమాధానమీయంబోవును. వారతని వైఖరిని బాగుగదిలకించి మాట్లాడించుట యుక్తముగాదని తలంచి యూరకొనిరి. ఆతండును మానవచరిత్రము నవలంబించి, వారిమాటల నాలకించుటవలనం దన సంభాషణారీతిని సవరించుకొనుచు నెన్నియోతలంపుల నూహించుకొనుచు నిశ్శబ్దముగ నొకమూలంగూర్చుండెను తనకాహారాదికముగావలసినచో

వార్తలే యిచ్చుచుండిరి. కాని, యాతని నిర్భాగ్య జీవితమును వినుటకు నాశపడలేదు. ఆతఁడు చెప్పుటకుఁ గూడ నిష్టపడలేదు. ఓడ నౌకాశ్రయమున కేగెను. ఓడలోనివారందఱు తమ తమ సామాగ్రితో దిగిపోవుచుండిరి.

సంస్కారవిహీనమై జడలల్లుకొనఁబోయిన కేశములతోడను, మాసి నాభిపఱకు వ్రేలాడు గడ్డముతోడను, రక్తవిహీనమై నలుపెక్కిన ముఖముతోడను, గుంటలువారిన కన్నులతోడను, విచారభరమున శుష్కించిన జీర్ణదేహముతోడను, చినిఁగిపోయి శరీరమునంతను గనుపింపఁజేసెడి వస్త్రములతోడను మాధవుఁ డాయోడనుండి దిగి కాంచగా నాప్రదేశమంతయుఁ దానిదివఱకు సంచరించినదే. ఆతని సంతోషమునకు మేర లేదు. అంధకారబంధురమగు నరణ్యప్రదేశమున దారితెన్నుగానక సంచరించుచుఁ బాంథునకు దివ్యజ్యోతి గనఁబడెను. ఆజ్యోతినాధారముగాఁ జేసికొని యాతఁడు సౌఖ్యముగా దన యిల్లును గాంచఁగలఁడు. ఆతఁడు తనగృహమునకుఁ బోవుచుండ నూహాతీతములగు నెన్నియో భావములు ఉదయించెను. తా నింటికిఁ జేరకుండఁగనే తన ధర్మపత్ని తన్నుగాంచి యెదుర్కొనుననియు, తనప్రియాపత్యము కాళ్లనుఁజుట్టి సంతోషింపఁజేయుననియు, ధనాభావముతో వచ్చు తన్నుగాంచి కమల నిందించునేమో యనియు, నిట్లె యాకాశ సౌధములనిర్మించుకొనుచుఁ దనగ్రామమును జేరుకొనియెను. మాధవుఁడనువ్యక్తిని మఱచిన యాగ్రామమునందుఁ దన్ను పలుకరించువా రెవ్వరు? పిశాచస్వరూపమున భయముగొల్పు నాతనిపరిచయము నపేక్షించువా రెవ్వరు! ఆతనిని గాంచినరతనే యందఱును దమతమ పనులందుఁ బ్రవేశించుచుండిరిగాని యొక్కరును తన్ను గుర్తించినవారును గుర్తింపనివారును గూడఁ గలుగరైరి. ఈవిషయముల నన్నియుఁ గమనించుచు నాతఁడు తనగృహ మున్న ప్రదేశమునకుఁబోయెను. ఆతని కనులు తిరుగఁజొచ్చినవి. ప్రియవనిత

తన్నెదుర్కొనగాదు. సంతానపు సవ్వడి వినరాదు. చిన్నికుమారుని యాటపాటలు గానరావు. సర్వశూన్యము శిథిలభవనము. నిశ్శబ్దము. తన కన్నులను నమ్మలేదు. కమల యేమైనది? సంసారదుఃఖమును భరింపఁజాలక తన ప్రాణదేహమును గౌతమి కర్పింపలేదుగదా? కమల యంతటి యధైర్యచిత్తురాలుగాదు. మదాగమనము నపేక్షించి యెందైన నుండవచ్చును. ఎవరినైన నడిగి తెలిసికొందునుగాక! నా యీ రూపమునుగాంచి నన్నెఱింగినవారైనను నాతో మాట్లాడుటలేదు. అపరిచితు లనలే దరికిఁజేరుటలేదు. కానిమ్ము. ఈరూపముతోనే కమలను దర్శించెద. కమలావృత్తాంతము నాయవ్వ నడిగి తెలిసికొనెద. నారాకనుమాత్ర మితరుల కెఱింగింపనని యాతఁడు నిశ్చయించి ప్రక్కనొక గుడిసెయందున్న ముసలియవ్వను జేరెను. ఆమెను మాధవుఁ డెఱుఁగుఁగాని మాధవు నామెపూర్తిగ మఱచిపోయినది.

అవ్వా! నిన్నొక్కవిషయ మడిగెద. తప్పక చెప్పెదవా? ఈ గృహమునందు మాధవుఁడను వ్యక్తి యుండెడివాఁడు. ఆతనిని నీ వెఱుఁగుదువా?

ఆమాటను విన్నంతనే యామె కనులనుండి బాష్పబిందువులు జలజల రాలెను. నాయనా! మాధవునెరుంగనివా రీగ్రామమునఁగలరా? నాకెన్నియో పర్యాయము లాతఁడుపకారమాచరించెను. ఇట్టిదశయందు మాధవుఁడున్నచో నాకీకష్టములు వచ్చెడివా? ఆతనిని నేను పూర్తిగ నెఱుఁగుదును ప్రతిదినము నాఁడు మాగుమ్మముముందునుండియే పోవుచు నన్ను బలుకరించి నాకేమైన ధనము గావలసిన నిచ్చెడివాఁడు. అట్టి పరోపకార పరాయణుని నేను మఱతునా? అని యింకను జెప్పఁబోవుచుండ నత డాత్మస్తుతిని సహింపఁజాలక చాలునవ్వా! నీవు మాధవుని పూర్తిగ నెఱుంగుదువు. ఆతఁ డిప్పు డెక్కడనుండెను.

ఆమె ప్రత్యుత్తరమును జెప్పలేక యొక దీర్ఘనిశ్వాసమును వెలిఁ

బుచ్చి పిమ్మట నాయనా! ఆతఁడు కాలగర్భమున మాటువడియుండెనో లేక మరణించియుండెనో! ఆతని వృత్తాంతమును స్మరించువారైనను నీగ్రామమునఁ గానరారు. ఆతఁడు బ్రతికియున్నాఁడని చెప్పిన నపహాస్యముగూడఁ గావింతురు. ఆతని మరణమునే యీగ్రామమువారు గోరుచున్నారు. ఈమాటలను వినుచున్నప్పుడు మాధవుని ముఖమున సంతాపముగాని సంతోషముగాని కనఁబడలేదు. మనసులో నెంత మాగ బాధ నందుచున్నాఁడో! అవ్వా! ఆతనిభార్య కమల యీ జీవలోకము నున్నదా? లేక యాతనిని నిందించుచు బరలోకమున కేగినదా? సంతానమేమైరి. దుఃఖభాజనుఁడగు నాతని వృత్తాంతమును త్వరగాఁ జెప్పుమని యాతఁడు దీనముగ నడిగెను.

మాధవుని స్మరించువారైనను లేని యీ మానవలోకము నాతని వృత్తాంతము నింతవిపులముగ నడుగుటకుఁ గారణమేమి? నీకాతఁడేమైన బంధువగునా?

కాదు. నాకుఁ బూర్వకాలమున స్నేహితుఁడు. వారిసంగతి యేమియు నాకుఁ గొన్నివత్సరములనుండి తెలియుటలేదు. కావున నూరక యడుగుచుంటిని గాని యితరమగు నభిప్రాయము నాకేమియు లేదు అని యబద్ధమాడెను.

నాయనా! ఆతనిభార్య సుఖముగానేయున్నది. మరణింపలేదు. సంతానముగూడ సంతోషముతోడనే యున్నది. మరణింపలేదు. కాని యాతనిభార్యయనఁబడుయువతి ప్రస్తుత మాతనిభార్యగాదు. ఆమె యైశ్వర్యమునాశించి కామమునుజంపుకొనలేక భర్తయగు మాధవుని విస్మరించి మఱియొకనిని వివాహమాడినది. ఆతఁడు చాల భాగ్యవంతుఁడు. మాధవునకు స్నేహితుఁడు, దామోదరుఁడు ఈమాటలనుఁ జెప్పుచున్నప్పుడు మాధవుని వర్ణించుటకు నాకువచ్చిన స్వల్పమగు

భావఁజాలదు. నాకరము వ్రాయలేదు. ఈబాధనంతను మనసునందే యనుభవించుచు నవ్వచెప్పెడిమాటల నాలించుచుండెను.

మాధవుఁడు పోవునరికిదుర్భర వ్యాధిగ్రస్తుఁడగుఁ జిన్నకుమారుఁ డీలోకమును విడనాడి శాశ్వతసౌఖ్యము ననుభవింపఁ బరలోకమున కేగెను. సంతానమిప్పుడు దామోదరుని గృహమందే తల్లితోడనే నివసించుచుండిరి. కమలాదామోదరులకుఁ బ్రేమఫలితముగా నిప్పుడొక కుమారుఁడుగూడ నుదయించెను. కమల మాధవుని బూర్తిగ విస్మరించి యాతని స్థానమున దామోదరుని నెలకొల్పుకొన్నది. అనివలికి విచారముతో నాయనా! నీవు మాధవు నీమధ్య నెప్పుడైనఁ గాంచితివా? ఆఁతడు జీవించియే యున్నాడా? నీకుఁ దెలిసి నంతవఱకు దాఁచక నిక్కముగ వచింపుమని యామె ప్రశ్నించెను. ఆప్రశ్నకు జవాబుగ నొక నిట్టూర్పుఁ బుచ్చి, యవ్వా! నీఋణమునుఁ దీర్పఁజాలను. మాధవుఁడు బ్రతికియే యున్నాఁడు. ఆ వివరముల నన్నిటిని ముందునీవు విన్న వింతువు. ప్రస్తుతము వచించుటకు నాకు శక్తిచాలదు. దయయుంచుము. మఱల దర్శింతును. అని యామెతో గష్టముగఁబలికి నడచుటకు, మాట్లాడుటకు, నేడ్చుటకుఁ గూడ నేమియు శక్తిలేక యొక విజనప్రదేశమున కరిగి భావికర్తవ్యమునుఁ గూర్చి యాలోచింపఁ దొడంగెను. ఆతఁడేదియో నిశ్చయించుకొని యెచ్చటికో పోవ బయలు దేఱెను.

ఆవేదన.

కమలా దామోదరులు సంతోషముగఁ బ్రేమసామ్రాజ్యము నేలుచుండిరి. వారి హృదయమునందే విధమగు బాధయుఁ గానరాదు. దామోదరుని జెట్టఁబట్టినప్పటినుండియుఁ గమలకు దారిద్ర్యమనుమాట యేలేదు. మాధవునితోడనే యామెదారిద్ర్య మడుఁగంటినది. మున్ను మాధవునితో సంచరించిన ప్రదేశములందే, విహరించిన యారామము లందే, ఆసీనయైన వేదికలయందే యిప్పుడు దామోదరునితో సంతసించుచున్నది.

ఒకనాఁడు ఆరామప్రదేశమునఁ గుమార్తెయుఁ గుమారుఁడును బొమ్మలతో నేదియో యాడుకొనుచుండిరి. దామోదరుఁడొక కుర్చీయందుఁ గూర్చుండి కమల చేతిలోనుండి పిల్లవానిఁ దీసికొని, ముద్దిడుకొని మఱల నామె కిచ్చుచుండెను. ఈ సమయముననే కుమార్తె చంటి తమ్మునకు నేదియో బొమ్మనివ్వఁబోయి మఱల లాగుకొనుట వలన నా యర్భకుఁడు బిక్కమొగమున నేడువసాగెను. ఆయేడుపును విని వారందఱు బక పక నవ్వుచుండిరి. సరిగ నీసమయముననే మాధవుఁడటకరుదెంచెను. ఆ దృశ్యమునుగాంచెను. కన్నులరుణము లయ్యెను.

"కట్టెదుట సౌఖ్యతరంగముల నోలలాడుచున్న యువతీ యువకులు కమలా దామోదరులేనా? నా హృదయాపహారిణి, నావలపుఁ బంటయు నగుఁ గమలయే యిట్టి కృత్యమున కొడంబడెనా? నన్ను—నా యాశలను, నాయూహాసౌధములను, నా భావిజీవిత సౌఖ్యసోపానములను భగ్నమాచరించినది. నాకు సహధర్మచారిణియై నాతోఁ గాఁపుర మాచరించి నేను విధివశమున కొన్నివత్సరములు దూరీకృతు నగుటంజేసి మఱల నన్యుని వివాహమాచరించుకొని కులుకుచున్నదిగదా? ఈమె

హృదయ మింత యపవిత్రమైనదని తెలిసియున్నచో వరింపకపోదును. ఆమె యిప్పుడు దామోదరుని యిల్లాలు. ఆమెను నేను స్మరింపరాదు. ఆ సంతానము నా సంతానమేయైనను నన్నిప్పుడు గుర్తింపఁజాలరు. దామోదరునే తండ్రిగా భావించుచున్నారు. ఆహా! ఈ కుటుంబమెంత సంతోషముగా నున్నది! నేను కాలగర్భమున లీనమైతినని తలంచియుండ వచ్చును—అని తలంచుచు నొక్కయడుగైనను ముందునకు సాఁపలేక పోయెను. ఒక్క మాటనైనను బలుకలేకపోయెను. ఒక్కభావమైనను దెలియఁజేయలేకపోయెను. ఒక్కవేడి కన్నీటిబిందువును సైతము రాల్పలేకపోయెను, అతని శరీరమే యాతనికిఁ దెలియదు.

ఇపుడు కర్తవ్యమేమి? ప్రతివిధానమేమి? ఒక ముష్టిఘాతమున దామోదరుని హత్యగావించి కమలను స్వాధీనపఱచుకొనుటయా? చేఁజేతల నాత్మజాయను బరుల కప్పగించుటయా? నీరసస్థితిలోనున్న నేను దామోదరు నేవిధములగుఁ బాకరముల నుపయోగింపక చంపుట సాధ్యమా? అని తలపోయుచు గంభీరముగా నొక కేకనువైచి వారల పరిణయమును భగ్నమొనర్చెదను. ఆ కేకతోఁ గమలహృదయము కరఁగ వలసినదే. దామోదరునిగుండె ద్రవింపవలసినదే? వారి సౌఖ్యసోపానము లన్నియు నేలఁగూలవలసినవే! కాని "కమల తప్పేమున్నది? దామోదరుని దారుణమేమి? మాబాల్యక్రీడలయం దామె తీర్పునొసంగు నపుడు ఇరువురకు యజమానుగాల నగుదునని వచించినది. అట్లే యాచరించినది. స్త్రీ పునర్వివాహము తనకిష్టమని సభాముఖమున గంభీరముగ నుపన్యసించినది. నేనీ విషయములను స్మరింపక యామె ప్రేమ శాశ్వతమని నమ్మి మోసపోయి వివాహము చేసికొంటిని. ఫలమును నేనే యనుభవింప వలయును. అదియుఁగాక కమలకూడ మానవస్త్రీ. మానవునకు యౌవనమందుండవలసిన కామ మామె నావరించినది. నే నామెను విడనాడి యెన్నియో వత్సరములైనది.

ఇన్ని వత్సరములు యువతి దుర్భరమగు విరహము ననుభవింపఁజాలుట దుస్సాధ్యము, నాగరికత- విద్యావతియగు నుత్తమస్త్రీ కావునఁ బునర్వివాహ మాచరించు కొన్నదికాని మఱియొక వనితయైనచో దుష్పథము నంటవలసినదే. అట్టివనిత లెందరీ లోకమున లేరు? ఆమె యొడియందు నవ్వుచు నాటలాడుకొనుచున్న చిన్నికుమారుఁడామె సొమ్ము. నాచిన్ని కుమారుఁడు పరలోకమున కేగినాఁడు. కమల నాజీవితమును నమ్మదు. నేను బ్రతికియుంటినని యామెకుఁ దెలిసియున్నచో నీ సంసారమంతయు భగ్నముకాఁగలదు. ఆమెకు సౌఖ్యముండదు, నిర్ధనుఁడనగు నావలన నామెకు దరిద్రమేకాని ధనము లభింపదు. కమల దామోదరుని విడచినచో దామోదరుఁడు బ్రతుకఁడు. నాకొఱకుఁ గమలను దామోదరుని హింసింపఁజాలను. నా సంతానము దామోదరు నాశ్రయించుట వలన సుఖముగా నున్నారు. ఇంతమంది వ్యక్తులను దుఃఖమునముంచి నాయునికినిఁ దెల్పనేల? నాకెట్టివిపత్తు వచ్చిన నా దారాపుత్రాదులు సుఖించుటయే నాయభిమతము. నేను మరణమునభిలషింతును గాని కమల సౌఖ్యమునకు విఘ్నమాచరింపఁజాలను. కమలాదామోదరుల మధ్య నేను విషవృక్షమును గాఁజాలను. అని తలంచుచుఁ బదముల వలన నలికిడినైనఁ గానీయక దొంగవలె నా యారామమును వీడి గౌతమీచెంత కరుదెంచి దీర్ఘనిశ్వాసమును వెలిఁబుచ్చి కింకర్తవ్యతావిమూఢుఁడై చతికిలఁబడెను.

మానవసంచారమలీమసముగాక పవిత్రమగు నాద్వీపరాజము నుండి భగవంతుఁ డేల యీపాడులోకమునుఁ జేర్చె? ఒకప్పు డందఱు నన్నాదరించు నీగ్రామమందిపుడు నన్ను గుర్తుపట్టువారుగూడ లేకపోయిరిగదా! ప్రేమవాహినియందు నన్నుఁ దేల్చు నాప్రియవనిత యన్యాక్రాంతమైనదిగదా? నిర్భాగ్యుఁడనగు నావలనఁ బ్రపంచమున కేమియు లాభములేదు. నాధనకాంక్షయే నన్నింతవఱకు సన్యాసినాచరించినది.

నేను భావిజీవితమం దాచరింపవలసిన మహత్తరకార్యము లేమియుఁ గానరావు. నాజీవిత మొకసంసారమునకుఁ గష్టదాయకము. కమల కేవల ముత్తమురాలు. ఆమె సామాన్య వనితకాదు. ఆమె ప్రేమ యనిర్వాచ్యము. ఆమె పునర్వివాహ మాచరించుకొనుటయందు దోషములేదు. నేనింతకాలము విరహసాగరమున ముంచుట దోషము. సంసారమునం దెన్నియో కష్టము లనుభవించి, నన్ను మృతునిగా భావించి యుత్తమ మార్గము ననుసరించి యబలాలోకమున కాదర్శభూతురాలై నది. ఆమెకు నాయందుండెడి ప్రేమవలన, నేను బ్రతికియుంటిననియు, నీగ్రామమున వసించుచుంటిననియు నామెకుఁ దెలిసినచో, దామోదరుని విడచి నన్నే చేరఁగలదు. ఆ పరిస్థితియందా నారీరత్న మాచరింపవలసిన కార్యమయ్యదియే. కాని, ఇట్టినాకును సుఖయగు నేఁటి కమలకును సంసారసౌఖ్యము శశవిషాణప్రాయము. దామోదరుఁడుగూడఁ గమలా విరహము నోర్వఁజాలక మరణింపఁగలఁడు. కావున, నే నీ మానవలోకమును విడనాడి శాశ్వతమగు స్వర్గలోక సౌఖ్యముల నందుటయే యుత్తమము—అని కర్తవ్యమును నిశ్చయించుకొనినను గార్యరూపము నందింపలేక పరిచితములగు గోదావరీ ప్రదేశములవంకఁ దేఁటిపాటఁ జూచెను.

అతని హృదయాంతరాళాన వితతమైన
వాతనిహతి పెనుతుపాను బయలుదేఱె,
ఊర్మిమాలికా సహస్రాల నూఁగు మనసు
కరము క్షోభించె ఘోరసాగరమురీతి. ౧

చెంతనున్నట్టి గౌతమి చేయిచాఁచి
ధవళ ఫేనపంక్తి నతని నపహసించి
పలికె నీరీతి హృదయ విదారకముగ-
'భావిజీవిత మిఁక దుఃఖభాజనంబు'! ౨

అతని నేత్రాల కఠిన యాస్యంబునందు
భావ చాంచల్య మొకమారు ప్రజ్వరిల్లె,
పూత గౌతమీ వారినిఁ బూర్ణచంద్రుఁ
గాంచి తనగాథఁ బూర్తిగఁ గాంచికొనియె. ౩

ఆఁపరానట్టి గాఢమౌ తాపభరము,
నేత్ర సీమల విహరించు నీటిభరము,
గాత్ర మంతట వ్యాపించు దుఃఖభరము,
అన్ని భరము లతనినే యావరించె. ౪

మనసు పుటపాక ప్రతికాశమగుచునుండ,
హృదయ వేదనా భారంబు కదలనీక,
నడచిపోయిన జీవిత నాటకాన
పాత్రలన్నిటి సరిజూచి పరిహసించు. ౫

పూర్వజన్మానఁ జేసిన పుణ్యమూల
కంబు, పురుషుని జీవిత కావ్యసమితి,
అహరహమును గావించు నల్పములును
అధిక మగుచుండు నుత్తర జన్మమందు. ౬

ప్రకృతియందలి సౌందర్యమునో, క్రౌర్యమునో పరీక్షించి, యాతఁడు కృతనిశ్చయుఁడై యున్మత్తునిఁబోలి బయలు వెడలెను.

ఆత్మార్పణ.

ప్రకృతియంతయు నిశ్శబ్దముగను గంభీరముగను నలరారుచుండెను. గ్రామమందలి జనులందఱు నిద్రాసౌఖ్యము ననుభవించుచుండిరి. చంద్రభగవానుఁడు నవ్వుచుఁ గలకలలాడుచుండెను. ఆసమయమున మాధవుఁడొకగృహమును సమీపించి-

అవ్వా! అవ్వా! తలుపుదీయుము.

నాయనా! ఇంతరాత్రి వఱకెచ్చటనుంటివి? నిన్ను జూచినప్పటి నుండియు నీయందు నాకధికమగు వాత్సల్య ముదయించుచున్నది. నిన్ను మున్నెప్పుడో చూచియున్నట్లు తట్టుచున్నది. భుజించితివా? లెమ్ము. అన్నముతిన్నపిమ్మట మాటలాడుకొనవచ్చును.

తల్లీ! నీయాదరణకు సంతసించితిని. కొన్నివత్సరములనుండి నాతో మాట్లాడువారైనను లేరు. నేను భుజింపలేదు. భుజింపను. నే నాచరింపవలసిన కార్యము పూర్తిగాకముందు నా కన్నము రుచింపదు. నిద్రరాదు. అవ్వా! భోజనమునకేమికాని, మరణించినఁగాని నా యాత్మకు శాంతిచేకూరదు. నామరణమువలనఁగాని యొకకుటుంబము సుఖింపదు. నాకీపరిస్థితియందు మరణమనుకూలించునట్లు భోజనమనుకూలింపదు. క్షమింపుము.

నాయనా!ఆహారాభావమునన్నట్లు శుష్కించియుంటివి. కాని నీకు ముప్పదివత్సరములైనను లేవే? అప్పుడే మరణమనుచుంటివి. మరణ మన్నఁ దేలికయా? అట్టి యమంగళవాక్యములు పలుకకు.

ముప్పదివత్సరములుగల నాశరీరమును నొకకుటుంబసౌఖ్యము నకై బలియొసంగుచుంటినని భావింపుము. అవ్వా! నామాటలు యథా

ర్థములని తలంచుచుంటివేమో? నే నాకారముచే నున్మత్తునివలెఁ గానవచ్చినను నాయభిప్రాయములుమాత్ర మున్మత్తములుగావు. నాకీవిశాల ప్రపంచమునఁ దావులేదు. నాకుఁ గొన్నిగంటలనుండి జీవితాశ నశించినది.

నాయనా! నీమాటలు నాకర్థమగుటలేదు. ప్రతిప్రాణియుఁ దన ప్రాణరక్షణార్థము ప్రాకులాడుచుండ నీకీవైరాగ్యమేల? జీవితమందింత చేదేల?

అమ్మా! నావృత్తాంతము నీకెఱింగింతును గాని, ముందు నీవొక బాసచేయవలయును. అట్లుచేసినఁ గాని నావృత్తాంతమును వినఁజాలవు.

అయ్యో! అంతకంటెనున్నదా? తప్పక చెప్పినట్లే యొనర్చెదను.

నాప్రాణి యీశరీరమును వీడునంతవఱకు నామాటలనేని ఇతరులతోఁ జెప్పఁగూడదు. నామరణానంతరము నేనుచెప్పినట్లు నీవాచరింపవలయును. విషాదకరమైన నాజీవితవృత్తాంతము నాశించుచున్న సమయమున విషాదమునుగాని వికాసమును గాని చూపగూడదు. దీర్ఘమగు నిశ్వాసమునుసహితము విడువరాదు. ఇట్లని నాచేతఁ జేయి వేయుము.

నీవు చెప్పినచొప్పునే వర్తింతును.

అవ్వా! ఆలింపుము. అవధానముంచుము. మీ కండఱకును దలలో నాల్కయై యొరులచే వ్రేలును జూపించుకొనని, నిర్భాగ్యుఁడనగు మాధవుఁడనుఁ నేనే. అదిగో! నీవప్పుడే విచారించుచుంటివి. నీబాసను దలంచుము. కమలను గాఢముగఁ బ్రేమించి యామె సౌఖ్యమునే కోరు మాధవుఁడను నేనే. సంసారసాగరము నీదఁజాలక ధనాశాతత్పరుఁడనై సంసారసాగరమును దరింప నౌకాయానమే ముఖ్యమనితలఁచి, కమల వలదనుచున్నను రోగగ్రస్థుఁడై బాధనందుచున్న కుమారుని విడచి నౌకాయానమున కరిగిన కరుణాశూన్యుఁడను నేనే. నౌక జలధి

మధ్యగుమున విలీనమైనను వృక్షరాజ సహాయమున దీవియంజేరిన కష్ట జీవిని. మనుష్యసంచార శూన్యమగు నాదీవియందిన్ని వత్సరములు సంచరించిన పిశాచస్వరూపుఁడను. ప్రవాసమున నున్నతతోఁ గములను దర్శింపఁగలననునాశతో నామె కొఱకై తపమొనరించిన విరహవిధురుఁడను. నేనా దీవియందు రాత్రింబవళ్ళను జూచుచుంటిని గాని, యెన్ని మహాయుగములుగడపితినో నాకే తెలియదు. దురదృష్టవశమున నీపాడు లోకమును దర్శింప వివేకవిహీనుఁడనై యొక నౌక సహాయ్యమున నరుదెంచితి. వచ్చిసపిమ్మటఁ గమలతో సుఖంతునని యాకాశసౌధముల నిర్మించుకొంటిని. మధ్యాహ్నము నీవు చెప్పిన మాటల వలననే నా యాకాశసౌధములు శిథిలమైనవి. ఇప్పుడు పూర్తిగా భగ్నమైనవి. ఒకప్పుడు నా సహధర్మచారిణియై, యాత్మపత్నియై యుండు కమల యిప్పుడు నన్ను పూర్తిగా విస్మరించి దామోదరుని సహధర్మచారిణియై మెలంగుచున్నది. మగవాఁడెవ్వఁడేని యావృత్తాంతము విన్నపిమ్మటఁదల నెత్తుకొనఁగలఁడా? క్రూరరాక్షసావతారమును దాల్చి ప్రభుద్రోహ్యో గీయులను సైతము లెక్కగొనక యాయువతీ యువకుల హత్యగావించి వారి రుధిరమును శరీరమంతటను బూసికొని వీరవిహారము సల్ప కుండునా? చిన్నికుమారుని మరణవృత్తాంతము నాలించి హృదయ విదారకమగు రోదనధ్వనుల భూమ్యాకాశములను గరుణాప్రవాహముల ముంచెత్తఁడా? అవ్వ! నే నా శౌర్యమును గాని దుఃఖమునుగాని చూపను. నాకీ ప్రపంచమందు బ్రతుకుట కిష్టము లేదు. అదియుఁగాక నీవుతప్ప యితరు లెవ్వరు నన్ను మాధవునిగాఁ దలంపరు. వారందరు నన్ను విస్మరించిరి. నా యాత్మజాయయే నన్ను విస్మరించిన నితరులు విస్మరించుట విస్మయమా? అవ్వా! నా కనులారఁగాంచితిని. నాభార్య కాదు. కమల దామోదరునితో సౌఖ్యమందుట, ఆమె ప్రియభాషణ ముల నాలించితి. నా సంతానము గూడ కమలాదామోదరులనే తలి

దంద్రులనుగా భావించుచున్నారు. నా మరణమువలన జీవకోటియం దొక్క పరమాణువైనను దుఃఖింపదు. నాకుఁ గమలయన్న మిక్కుటమగు మక్కువ. ఆమెను నేనుమాత్రము నిందింపను. ఆమె దామోదరుని వలన సుఖించుచున్నది. నేను బ్రతికియుంటినని యీ యబలకుఁ దెలిసినచో దామోదరునివదలి నాయొద్దకుఁదప్పక రాఁగలదు. ఆమె యభిప్రాయమును నే నెఱుంగుదును. అట్టి కమలను నేను స్వీకరించుట భావ్యముగాదు. నా యంతరాత్మ యందుల కంగీకరింపదు. నన్ను జూచిన పిమ్మట దామోదరుని యొద్దకేగను. ఆమె జీవిత మిప్పు డంధకారబంధురమగును. ఆమె. లేనిచో దామోదరుఁ డామెయందలి ప్రేమచే మరణించును. అందులకు నా యునికి నామెకుఁ దెలియనీయఁగూడదు. ఇంతియగాక నేనీ జీవలోకములో నుండినచో నెప్పటికైన బయటపడక మానను. అప్పుడైనను గమలకు విషమపరిస్థితి తటస్థించుట తప్పదు. కావునఁ గమల సౌఖ్యమునకై, కమల యున్నతికై, కమల సంసారమునకై, కమల పురోభివృద్ధికై నాయాత్మ నర్పించెద. నా యాత్మార్పణ వలనఁ గాని కమలా దామోదరుల ప్రేమజీవితము ధన్యముగాదు. ఇతరుల కాదర్శప్రాయముగాదు. మరణించు నాకేమియుఁ గోరికలేదు, కాని, నాచిన్నికుమారుని జూడలేకపోతిని గదాయని విచారించుచుంటిని.

అతఁడు మరణించుచున్నప్పుడు నాకొఱకెంత వాపోయెనో, నాకెఱింగించి యాత్మశాంతి నొసఁగూర్చువారు గూడలేరు. ఇప్పుడైనను మించిపోలేదు. పరలోకముననే యతనినిఁ గాంచెద, ఈమాటలను మాధవుఁడు చెప్పుచున్నంతసేపు నాయవ్వ చిత్రప్రతిమవలెఁగొయ్యబారియుండెను. నాయనా! మాధవా! యెంత దీనదశనందితివోయి! అని యాతనిఁ గౌఁగిలించుకొని కొంతకాలము విలపించి, కమలతోఁజెప్పి నీ సన్నిధికిఁ దోడ్కొనివచ్చెద నిచ్చటనే యుండుమని బయలుదేఱఁ

బోయెను. అహా! మొదటచేసిన బాసను మఱచితివా! నీవట్లు పోఁగూడదు. మఱియొక గంటపోయిన తరువాత నీవందఱికిఁ జెప్పవచ్చును. నాయంత్య సందేశమును గూడ వినుము.

“నేనింక నొక గంటకాలములోఁ దప్పక మరణింతును. నాచిన్న కుమారుఁ డప్పుడే తన చిన్నచేతులతో నన్ను బిలుచుచున్నాఁడు. నా మరణానంతరమున నాశవమును గూడ కమల చూడఁగూడదు. ఆమె చూచినచో నాయాత్మ శాంతింపదు. నాసంతానమును మాత్రము నీవు తీసికొనివచ్చి నాశవమును జూపుము. వారు కోరకున్న నీవు నావృత్తాంతమును గాని రాకనుగాని మరణమునుగాని తెలుపకుము. ఇంతవఱకు నవధానముతో నావిషాదజీవితము నాలించిన నీకుఁ బదివేల నమస్కారములు. ఉదయమునకు నేను స్వర్గసౌఖ్యముల ననుభవించుచుందును. నా మరణానంతరము వఱకు నీవృత్తాంతము నొరులకు విన్నవింపకు సుమా! నీవుపోయి పరుండుము, నేను మరణశయ్యపైఁ బరుండు” నని యామెను బంపివేసి యాతఁడు తన జీవితనాటకమునందలి తరంగముల నన్నిటినిఁ బరిశీలించుచుఁ బ్రేక్షకునివలెనానందమును, దుఃఖమును వెలిఁబుచ్చుచు ధైర్యమునవలంబించి కొంతసేపు కనులనుమూసికొని సర్వేశ్వర ప్రార్థనముగావించి నేనువలచిప్రేమించిన కమలా సౌఖ్యమునకై ప్రస్తుత మితరుఁవలచి ప్రేమించి సుఖించుచున్న కమలా సౌఖ్యమునకై నాయాత్మను బలినొసంగెద. నాయాత్మార్పణగావించెద. అని యొక మాత్రనుమ్రింగెను. ఆ పవిత్రహృదయుని-ఉదారాశయుని నోటినుండి “యస్పష్టముగఁగమలా సౌఖ్యము-ఆత్మార్పణ-ఆత్మశాంతి”-యనుమాటలు వినవచ్చెను. ఇంకేమున్నది? ఆతఁడు-యాతనామయము, కష్టభూయిష్ఠమునగుఁబ్రపంచమును విడనాడి శాశ్వతసౌఖ్యమును జూఱఁగొన మనుష్యసంచారశూన్యమగుఁ బ్రపంచమును వెతకుకొనుచు నేగెను. అతని యాత్మకు శాంతికలుగుఁగాక!

పూర్వస్మృతి.

కష్టముల కునికిపట్టు, హృదయవిదారకము, విషాదభరితము నగు మాధవుని జీవితరహస్యమును, కఠినహృదయునిఁగూడఁ గరఁగింపఁ జేయు నంత్యసందేశమును, ప్రేమకొఱకుఁ బ్రాణముల నర్పించిన యాతని పవిత్రప్రణయమును విని, దర్శించిన యాయవ్వ హృదయము దుఃఖసంభరితమయ్యెను. అతని నా యకృత్యమునుండి మఱలించుటకైనను బ్రయత్నింపలేకపోయెను. మాధవుని మోహిల నదించుటకుఁ గూడ నశక్తురాలయ్యెను. ప్రపంచమునందు జన్మించిన వ్యక్తికి మరణము తప్పదు. ఆమరణముగూడ పూర్వజన్మ సంచితఫలమువలననే సౌఖ్యముగనో దుఃఖముగనో కలుగుచుండును గాని, యితరులకొఱకు అందను దాను ప్రేమించిన యువతి-యన్యాసక్తహృదయురాలై తన్ను విస్మరించినను బూర్వస్నేహమును మఱలుపుకొనలేక మరణించినవ్యక్తి యాయవ్వ యనుభవమునకు గోచరింపలేదు.

తత్క్షణమేపోయి కమలకీ వృత్తాంతమును విశదపఱచి యామెను దోడ్కొనివచ్చి మాధవుని మరణనిశ్చయమును మాన్పవలెనని యామె ప్రయత్నించెనుగాని తాను మాధవుని కొసంగిన బాస ననుసరించి యట్లుచేయుటకు సంకోచించెను. అట్టి యవతారపురుషుఁడు, విశాలహృదయుఁడు మానవలోకమును విడనాడి యరుగుచున్నందుల కామె యెంతయో విచారించెను. అట్టి యుత్కృష్టగుణములుగలవ్యక్తి వలన దేశమునకెంతయో యుపకారము జరుగనున్నది నశించినదని యాయవ్వ తలపోసెను. ఎంతయాలోచించినను, విచారించినను మాధవుని నామెబ్రతికింపలేదు. అయినను బ్రయత్నించి యాప్రయత్నమునుండి

మఱల్పవలయునని దృఢసంకల్పమున నాతఁడు పరుండియుండిన గదియొద్ద కాతురతతో నరుదెంచెను.

ప్రసన్నవదనమున ధ్యాననిమీలిత నేత్రుఁడై నిశ్చలతపస్సమాధిమగ్నుఁడగు మునీశ్వరుచందమునఁ బ్రాణములఁబాసినను, బవిత్రముగాఁ గన్పించు మాధవుని చెంతకరిగి, యాతఁడు కనులఁదెఱచినపిమ్మట మరణవ్యవసాయమును మఱల్పవలయునని నిశ్చయించి, చాలసేపు మాటలాడక నిలఁబడియేయుండెను. ఎంతకాలమట్లు నిరీక్షించినను మాధవుఁడు తనవైపు దృష్టిని బ్రసరింపఁజేయకుండుటచే బాగుగా దగ్గఱకరిగి, నాయనా! నామాటవినుము. నన్నొకపర్యాయము వీక్షింపుము. అని పలుకుచు, నాతని నాసారంధ్రములనుండి నిశ్వాసములు పైకిరాకుండుటవలన నపగతధైర్యయై, యాతనిఁదాకిచూచెను. శరీరమంతయుఁ జల్లగానున్నది. ఆమెహృదయము ఝల్లుమనెను.

అయ్యో! అంతయుఁ బూర్తియయినదా? నేనెంత యవివేకురాలనా! నీవు వలసన్నను నలుగురతోఁజెప్పి నీమరణమును దప్పింపఁజాలపోయితినిగదా? నేను కఠినాత్మురాలను. ఇతరులతో నీవృత్తాంతమును జెప్పియుండినచో వారలు నిన్నిప్రయత్నమునుండి మఱల్పఁజేసెడివారు. కమలా! నీవెంతటి క్రూరాత్మురాలవే? నన్ను వలచుటవలన నొక యుదారాశయుఁడు మరణింపవలసివచ్చెను. నీవు ప్రేమను గుఱుతింపఁజాలవు. నీహృదయము పాషాణమయము. అందుఁబవిత్రప్రేమకుఁ దావు లేదు. నీవు ధనము నపేక్షింతువుగాని, ప్రణయము నపేక్షింపఁజాలవు. నీహృద్గతాభిప్రాయమును బూర్తిగ నెఱింగియో నెఱుంగకయో మాధవుఁడు నిన్ను వలచి తననిండుప్రాణమును విడచెను. అని యామెను నిందించుచు, తెల్లవాఱినవెంటనే యీవృత్తాంతమును గ్రామమందలివారలకుఁ దెలుపవలయునని తలంచుచు మాధవుని కళేబరముపైఁబడి విచారించుచు నాకాళరాత్రిని గష్టముగ వెళ్ళఁబుచ్చెను.

తెల్లవాఱినది. అవ్విశోకమునుగాంచి కాకులుగూడ కావుకావు మని యేడ్వసాగెను. సూర్యభగవానుఁడు తనకరముల నామృతకళేబర మును స్పృశింపకమున్నె యాగ్రామవాసులకందఱకు నావిషాదవృత్తాంత ము తెలిసెను. గుంపులుగుంపులుగా నూరివారందఱు వచ్చి యాతనినిఁ గాంచి విచారింపసాగిరి. కొందఱు మాధవుని యవిమృశ్యకారిత్వమును, కొందఱు కమలయొక్క దుర్వ్యాపారమును దలంచి నిందింపసాగిరి. కమ లకుఁ గూడ నెవ్వరోదీనుఁడు మరణించెనన్న సంగతి తెలియుటవలన నొక యుష్ణనిశ్వాసము వదలి యాతని యాత్మకు శాంతికలుగుఁ గాకయని భగవంతునిఁ బ్రార్థించెఁ గాని, యామరణవృత్తాంతము విన్న వ్పటినుండియుఁ దనపుత్రుఁడు మరణించినప్పుడు గూడ ననుభవింపని వేదన నందుచుండెను. తనకార్యములయందుఁ గరముసాగుటలేదు. తనజ్యేష్ఠసంతానమును గౌఁగిలించుకొని విచారింపవలయునని తలం చెను. ఆమె విషాదమునుగాంచి పుత్రికాపుత్రులిరువురు తల్లిచెంత కరుదెంచిరి. ఇంతలో నవ్వ యచటికరుదెంచి కమలముఖము నొకపరి తిలకించి యసంతృప్తిని వెల్లడిపఱచి యాయిరువురి బిడ్డలను గౌఁగిలించు కొని బిగ్గరగనేడ్వఁ దొడంగెను. అకారణముగు నాయవ్వరోదనము నాల కించి కమలయుఁ గన్నులవెంబడి నీరుగార్చుచుఁ గారణమేమని ప్రశ్నిం చెను. వీరిరువురవిచారమును గాంచి యాపిల్లబిడ్డలుగూడ బిక్కమొగ ములతో నేడ్వఁదొడంగిరి.

అమ్మా! నాతో రండు, మీతండ్రినిఁ జూపెద. అని యాయవ్వ పల్కుచు వారల నిర్వురఁ దీసికొని పోవుచుండఁ గమల, యవ్వా! ఈ యుల్లోలము లేల? తండ్రి యెవరు? చూపుటయేమి? అని ప్రశ్నించినది.

ఛీ! పాపాత్మురాలా! నీతో మాట్లాడరాదు, నీవు కృతఘ్ను రాలవు. ఐశ్వర్యముసపేక్షించి, సౌఖ్యము నాశించి, హృదయనాథుని నుఱిది మఱల నొకనిని వలచి కులుకుచుండిన పాపాత్మురాలవు.

అవ్వా! క్షమింపుము. నావలన దోసములున్న సైరింపుము. తండ్రిని జూపుటయనఁగా నర్థము చెప్పుము.

కమలా! నీకుఁ బూర్వస్మృతి యేమైన నున్నదా? పూర్వజీవిత మందలి సంఘటనలేమైన నీ స్మృతిపథమునఁ గోచరించుచున్నవా?

ఆయవ్వ మాటల నాలకించిన వెంటనే కమల కాఁపరాని దుఃఖ ముదయించెను. గడచిన జీవితనాటకమందలి రంగములన్నియు నామె హృదయ యవనికయందుఁ బ్రత్యక్షమాయెను. మాధవుఁడు తనస్మృతి పథమునఁ దట్టెను. అతని పత్రప్రణయము మనసున గోచరించెను. హృదయమందెన్నియో భావములు చెలరేఁగి యామె మర్మస్థానముల నెత్తిపొడవ సాగెను, ఆ బాధలకామె తాళజాలక తనయవస్థా కృత్య మునకు రోసి అవ్వా! నీవు నిజముగ వచింపుచుంటివా? మాధవుఁడరు దెంచెనా? ఎచ్చట నున్నాఁడు? ఎట్లున్నాఁడు?

ఆఁ- మాధవుఁడరుదెంచెను, అతఁడు సంతోషముతో నీయందలి ప్రేమను మఱల్చుకొన జాలకఁ బరలోకమున నున్నాఁడు. అతని మృత కళేబరము మాత్రమింకను మాయింట నున్నది. అని యవ్వపలుకుట తోనే కమలకుఁ బిచ్చియెత్తినట్లయినది. ఆమె వీధివెంబడి యున్మత్తు రాలువలె వాపోవుచుఁ బరువెత్త మొదలిడెను. ఆమె విచారమున కంతము లేదు.

అట్లు వాపోవుచుఁ బరువెత్తుచున్న కమలను అవ్వ వారించెను. కమలా! నీకిప్పుడు మాధవునిఁ జూచుటకు స్వతంత్రిము లేదు. ప్రస్తుత స్థితియందున్న నీకును మాధవునకు నే విధమగు సంబంధమును లేదు. నీవు దామోదరునకు భార్యవు, మాధవునకు భార్యవు గాకపోవుటయే కాకఁ యాతనికి స్నేహితురాలవును గావు. మఱియు నాతని నిండు ప్రాణము నశించుటకు నీవే కారణభూతురాలవు. నీ సౌఖ్యముకై తన సౌఖ్యమును గణింపకతుదకుఁ దన ప్రాణములనుగూడ నీ కర్పించిన

యుదారాశయుఁడు. నీవాతని కళేబరమును స్పృశించి యపవిత్రము చేయరాదు. అతని యాత్మశాంతికి భంగము కలుఁగఁజేయకుము. ఈపిల్లలిరువురు నాతని సంతానము గావున, మృతకళేబరమునైనను గాంచి కన్నీరును విడచుటకు నర్హులు. ఎన్నియో వత్సరములనుండి తమ పితృదేవతను మఱచి, నీవలన దామోదరునే తండ్రిగా భావించుచున్న వీరిరువురు నొకపర్యాయ మాతని వీక్షించినచో యథార్థమును గ్రహింపఁగలరు.

"నా మృతకళేరమును గమల దర్శించుటకైనను వీలులేదనియు, నా సంతానమున కపేక్షయున్నచో దర్శింపవచ్చుననియు, నీవాక్యములకు వేఱువిధముగా జరిగినచో నా యాత్మశాంతి నొందదనియు, మాధవుని యంత్యసందేశము నిన్ను నాయింటికి రానీయను, మాధవుని దర్శింపనీయను, నీకాతఁడు భర్తఁగాడు, నీవాతని భార్యవుగావు. నీచేతలచేఁ గావు. ఇంటియందే యుండు మనుచు నాయవ్వ పిల్లల నిర్వురఁ దీసికొని తనయింటికిఁ బోయెను.' పిల్లలిరువురు విచారభావముతోడనే యుండిరి.

పరితాపము.

అవ్వా! ఈనిర్భాగ్యురాలియందు దయయుంచుము. నేనుగూడ నీవెంటవచ్చెద. నాహృదయవేదన మతిశయించుచున్నది. యౌవనమదాంధకారనై దనాశాపీడితనై దుర్భరదారిద్ర్యముతోఁ గూడియున్న సంసారసాగరము నీదఁజాలక మాధవుని విస్మరించి మఱియొకనిఁ జెట్టఁబట్టవలసివచ్చినది. కొన్నివత్సరములనుండి యాతనిజాడలేమియుఁ దెలియరాకుంటచే నీ జీవలోకమును విడనాడి నన్నునాథ నాచరించెనను నూహతో, నాకితరులెవ్వరు సహాయులు లేకపోవుటచే సంతానమునుసాకుట కష్టసాధ్యమగుటచే నీకృత్యమాచరింపవలసి వచ్చినది. నన్ను క్షమించి మాధవుని దర్శింపనిమ్ము మాధవ ముఖారవిందదర్శన భాగ్యమునందుటకు సెలవిమ్ము. అహా! అతఁడిప్పుడెందుండునోకదా?

కమలా! నీవెంతవిచారించినను లాభములేదు. నీవు మాధవుని విస్మరించి దామోదరునివరించుటవలన మాధవునకును నీకునుగల ప్రేమసూత్రము విచ్ఛిన్నమైనది. ఆసూత్రముచేతనే మీరిరువురు బూర్వము బద్ధులై యాదర్శప్రాయులగు దంపతులైరి. ఆనాఁడు నిన్నుఁజూచి ప్రజలందఱు మెచ్చుకొనెడివారు. ఇప్పుడు నిన్ను గలఁచువారుగూడ నుండరు. కావున, మాధవ దర్శనప్రయత్నము నుండి మానుము. అన్యకాంతవగు నీవాతని దర్శనమాచరించినచో హృదయోద్వేగ మతిశయింపఁగలదు. ఆవేశనవలన నీవెంతటి కార్యమైన నాచరించుటకు సాహసింతువు. ఈ యభిప్రాయముతోడనే మాధవుఁడు తన్నుజూచుటకు నీకవకాశ మీయలేదు, ఇఁకనీవింటియొద్దనే యుండుము. ఈపిల్లల నెవ్వరను మధ్యాహ్నమంపెద.'

అని యాయవ్వపలుకుచు నాపిల్లలనిర్వురనుదఁయింటికిఁ దీసికొని పోయెను. తల్లియొక్క విచారము, అవ్వయొక్క యదలింపులు వినుచుం డుటవలన వారలకుఁబూర్వవృత్తాంతము స్మరణకువచ్చుచుండెను. ఎవరో యొకవ్యక్తి కొన్నివత్సరములకుముందు నెచ్చటనో బాష్పపూరిత నేత్రములతో గద్గదకంఠముతోఁ దమ్ముఁగాంచి భయభక్తులతో వర్తింపుఁడని యొసంగినయాదేశము-"త్వరలోనే, నేనరుదెంతును. మీరుమాతృము నన్నుఁ గాంచఁగలరు" అనిపలికిన యనునయవాక్యములు వారలకుఁ దట్టినవి. అంతకుఁ బూర్వమెప్పు డాపరార్థియము లాతఁడు తమకువలయు వస్తువులను దీసికొనివచ్చి యిచ్చుచుండుటయుఁ దమ్ముముద్దుఁగొని సంభావించుటయు మొదలగువృత్తాంతములు జ్ఞప్తికి వచ్చినవి. ఆ కాలమునందును, అంతకుఁబూర్వమందును నాతనినే తాము 'నాన్నగారూ!' అనిపిలచుట యలవాటనియుఁ దరువాత దామోదరుని 'నాన్నా'యని పిలువవలసి వచ్చినదనియు నీసంగతుల నన్నిటిఁ దలచుచుఁ బైకిఁజెప్పలేని మూఁగబాధ ననుభవింపుచు, ఇష్టజన మరణజన్యదుఃఖము నెఱుంగని లోకానుభవ శూన్యులగు నాయిరువురు నవ్వవెంబడి నడచుచు నామె యిల్లుఁజొచ్చిరి. వార్లిద్దఱు దోవవెంట నరుగుచుండ విచారించువారు కొందరు, కమల యెంతటిదుర్మార్గురాలని కొందరు, కమల యెంతటి అవిశ్వాసినియనికొందరు, పాపము తండ్రిలేనిబిడ్డలైతిరని కొందరు, అంతమంచివాఁడు దొరకఁడనికొందరు పలుకుచుండ నామాటలనాలకించి వారిరువురు నొకరిముఖమువంక నొకరుచూచుకొని, అక్కా! మనలఁ జూచి యింతవిచారించెదరేలనే? ఈఅవ్వమాటల కర్థమేమియని యా బాలకుఁడు- తమ్ముఁడా! ఒకక్షణమూరకొనుము. పిమ్మట యథార్థ మంతయు బోధపడఁగలదు, అనిబాలికయు మాట్లాడుకొనిరి.

జనులందఱు జుట్టునుమూగి తన్నుఁ గలచి విలపించుచుండ మాధవుని మృతకళేబర మచ్చటనేయున్నది. గ్రామవాసులందఱు నాతని

పవిత్రాశయములవేనోళ్ళ నుగ్గడింపుచుండిరి. మరణించినను ముఖమం
దిసుమంతయు వికాసముతగ్గలేదు. పవిత్రభావముతో-నాత్మవిశ్వాసము
తో-హృదయధైర్యముతో-మరణించిన వ్యక్తిమరణమును గోరికొనిన
వ్యక్తికిఁ జారమెచ్చటనుండును?వికాసమెటుతగ్గును? ఆవ్వ యాబాలికా
బాలకులనిరువురనటకుఁదోడ్కొ-నివచ్చియమ్మాయీ!ఈతఁడేమీతండ్రి.
మీతల్లిసౌఖ్యమునకై-మీతల్లి భావిజీవితమునకై-మీ యున్నతికి స్వ
యముగా మరణము నాహ్వానించినయుదారవంతుఁడు. పరోపకారము
కొఱకుఁ బ్రాణములఁగూడ నర్పించిన యుదారవంతుడు. పరోపకారము
కొఱకుఁ బ్రాణములనర్పించిన గంభీరహృదయుఁడు. ఒకసారి దర్శించి,
స్పృశించి, విచారించి, యెల్లకాలము స్మరింపుచు నతనికి హృదయ
శాంతి నొనఁగూర్పుఁడు మీరాతని దర్శింపకున్న నాత్మశాంతి కలుగ
దనియుఁ, గమలదర్శించిన యాత్మశాంతి కలుగదనియు నాతని యంత్య
సందేశము. అని యామాటల నవ్వ ముగింపకుండగనే గోదావరీవరదల
యందువలె వెల్లువలై పాఱుచున్న యశ్రుప్రవాహముతో సంస్కార
వశమున స్మృతికిఁదట్టిన పితృభావముతో వారిరువురు దమతండ్రిపై బడి
యేడువదొడంగిరి. తమతండ్రి యుత్కృష్టమగు గుణములను స్మరించు
కొని-నౌకాయానమే నీకు సంసారసాగరమును దరింప యానమైనదా?
అమ్మయందు గోపమున్నను, మమ్ములఁ దలంచియైనను మరణవ్యవ
సాయమునుండి మరలి మమాదరింపరాదా?-అని పలువిధముల విచా
రించుచుండ దామోదరుఁడుగూడ నచటికివచ్చెను. నిర్భాగ్యుడగు
మాధవునిజూచి యుష్ణ నిశ్వాసమును మాత్రము విడచెను.

దహనమునకుఁ గావలసిన పరికరములను సిద్ధముచేయించి యా
వ్యయమునంతయు దానేభరింప సంసిద్ధుడయ్యెను. అన్నియు సిద్ధముగ
నున్నవి. శవమును శ్మశానమునకుఁ గొంపోవసిద్ధముగానున్న సమయ
మున దూరమునునుండి యొకస్త్రీ గద్గదకంఠయై, వికీర్ణకేశపాశయై,

తొట్రుపాటు పడుచున్న పదములుగలదియై "వలదు. వలదు." నన్నొక పరిదర్శింపనీండు. నేను పాపాత్మురాలను. ఆగుఁడు. అని కేకలువేయుచు నరుదెంచుచుండెను. అవ్వ యావ్యక్తిం జూచి యామెను రానీయకుఁడు అపవిత్రురాలగు నామెను దర్శించినంతనే పవిత్రమగు మాధవుని మృత కళేబరము మైలపడును. కావున నామె రాకమున్నే యీశరీరమును శ్మశానమునకుఁ గొంపోవుఁడు. అని హెచ్చరించెను. వాహకులు మాధవుని పాంచభౌతికశరీరమును గొని పోయిరి. ఆ యాతురవనిత యవ్వచెంత కరుదెంచి, యవ్వా! నేను పాపాత్మురాలనైనను నాకార్యమందుఁ దప్పిదములేదు. అతఁడీ జీవలోకమును విడనాడెనని తలంచి నేను మఱల వివాహము చేసికొంటినిగాని, యాతనివృత్తాంత మిసుమంతయైనఁ దెలిసియున్నచో నట్టిపనికి నేనుఁబూనుకొనను. అదియుఁగాక దుర్భరదారిద్ర్యమును నేనెట్లనుభవింపఁగలను. ఇట్టిపనుల కాచరించినను, నేనాతనికి భార్యనుగాకపోయినను, భార్యాత్వ సంబంధముఁ గాకపోయినచో మిత్రత్వమునకైనను మాధవుని దర్శింప నర్హురాలను. నామాధవుని నన్ను జూడనీయనిచో నాకీజీవితమేల? యని యామె వెంట బోఁబోవుచుండెను.

మున్నెన్నఁడును గని విని యెఱుఁగని యీనాటకమునంతను గాంచినంతనే యాపిల్లల కిర్వురకు నొకవిధమగు దుఃఖమును వేఱొకవిధమగు క్రోధమును జనించెను. తాము పితృదేవతను బూర్తిగ విస్మరించుటకుఁ దమమాతయే కారణము. పితృవృత్తాంతమును స్మరించినంతనే విచారము నామె చూపెడిది. ఆమెకు విచారకరమగు వార్తను స్మరింప నేల? అని తలచి యావృత్తాంతమును వారలు పూర్తిగ విస్మరించిరి. దామోదరునే యింతవఱకుఁ దండ్రిగా భావించుటకుఁ గూడతమ తల్లియే కారణము. ఆ నాఁడన్నము భుజించుచుండ నమ్మా! నాన్నగారెప్పుడు వత్తురే! యనియడుగ నిప్పుడే వత్తురమ్మా! యని యామె

పలికినది. ఆమాట వెంబడినే ప్రవేశించిన దామోదరునిఁజూచి యజ్ఞానమునఁ దండ్రిగాభావించిరి. నిజవృత్తాంతమును గప్పిపుచ్చి యాతనినే తండ్రిగా భావించు మమ్ములను వారింపలేదు. తుదకుఁ దమతండ్రిమరణమునకుఁగూడఁ దమతల్లియేకారణము. తాను ప్రథమభర్తను విస్మరించి ద్వితీయభర్తను స్వీకరించినతఱి మాధవుడుగనుకనే యామె సౌఖ్యమునకై ప్రాణముల విడిచెనుగాని మఱియొకఁడైనచో నామెను హత్యగావించఁడా? అని తలంచుచుఁ దమపితయొక్క యాకస్మికమరణమును దలంచివాపోవుచు గర్తవ్యజ్ఞానహీనులై యాయవ్వయింటనే యుండిరి. ప్రస్తుతావస్థనుబట్టి యనన్యగతికులగు నాబాలికాబాలురకు నాయవ్వయే యాధారము. దైవమీవిధముగా నాధారమును జూపుచుండును

నిశ్చయము.

పూర్వమొకప్పుడు తన్నువలచి ప్రేమించి ప్రేమింపఁబడినవ్యక్తి-ఎన్నియోవత్సరములనుండి జాడయే తెలియనివ్యక్తి-ఇట్టిపరిస్థితియందుఁ గూడఁ దన్నే సర్వముగాభావించి యాదరించువ్యక్తి-ఎవని దర్శనము కొఱకుఁ గొన్నివత్సరములు కనువేఁచుచునందియుండెనో యట్టివ్యక్తి–యీ గ్రామమువచ్చి తన సౌఖ్యమునకై తనయున్నతికై ప్రాణముల నర్పించెనన్న విషయమా విద్యావతికి-నాగరికతగల యువతికి దుర్భరమాయెను. దానికి బ్రతీకారమాచరింపవలయునని యామెయాశ. అతఁడు బ్రతికియుండినచోఁ బాదములపైఁబడి వేఁడుకొని మరణవ్యవసాయమును దప్పకమఱల్పఁగలదు. సమయము మించిపోయినది. మాధవుఁడు మరణించినాఁడు. కర్తవ్యము తోఁచుటలేదు.

దుస్తరమైన సంసారసాగరమును దరింపలేనిరోజులలో–గృహయజమానిలేక గృహమంతయుఁ బాడగుచున్నరోజులలో-పిల్లలాఁకటచే మలమలమాడుచు నల్లాడుచున్నరోజులలో–తా నుపవసించుచుఁ బ్రాణాపాయ స్థితియందున్న దివసములలో-గృహముశిథిలమై యందున్నవారల కపాయకరమగుఁ బరిస్థితులలోఁ గమల దామోదరునిచెంతకు వచ్చినది. అతని ధనము నపేక్షించినది. కొన్నాళ్ళు పోయినపిమ్మట నాతని కోరికననుసరించి యాతనిని వివాహమాడ నభిలషించినది. ఇందేమియుఁ దప్పులేదు. కొన్నిసంవత్సరములు ప్రోషితభర్తృకయై యౌవనవతియైయుండు నబలాలలామ మఱియొకనిని వివాహమాడి యాతనిని భర్తగాభావించుట తప్పుగాదు.

కమలా హృదయాశయమును బాగుగాఁదెలిసికొనిన మాధవునికే యాకృత్యము తప్పుగాఁదోఁపలేదు. కావుననే యాదైవోపహతుఁడు

దారాపుత్రాదులఁగాంచి సంతసింపనచ్చునని తలంచి మానవసంచార శూన్యమగు నా ద్వీపమునందసువుల భరియించి యుండి తుదకు స్వగ్రామమునందు దారా పుత్రాదులఁగాంచి మరణించుటేమి? విధి విధానము.

శోకవిహ్వలచిత్తయై మూర్ఛిల్లిన కరుణరసాధిదేవతయో యన నాయంగన యొకదానివెంబడి నొకపూర్వవృత్తమును దిలకించుచుండెను బాల్యక్రీడ- బొమ్మలపెండిండ్లు- ఉపన్యాసము- శరత్కాలమందలి వెన్నెల-వలపు-సంసారము-సంతానలాభము-మాధవుని నౌకాయాత్ర-ఆగమనము-మొదలగుదృశ్యములను మనఃఫలకమున వీక్షించినంతనే యామె హృదయవేదనాభారమునఁ గుంగఁజొచ్చెను. మాధవుఁడు-మాధవుఁడు అతనిసంసారము వేఱు-దామోదరునిసంసారము వేఱు. పరాత్పరుఁడు భావిపరిస్థితులనుఁగూడ ముందుస్ఫురింపఁజేసితదనుగుణములగు జర్యలను మాటలను ముందుగనేచేయించుచుఁ బరికించునేమో? అట్లు కానిచో మాబాల్యక్రీడయందలి బొమ్మలపెండ్లిండ్లనాఁడు మాధవ దామోదరులు కలహింప నేను వారికలహాము నివారింపనిశ్చయించి పలికినపలుకులు యథార్థములయినవే. నానోటివెంబడి యాపలుకులు వెలువడినతోడనే మాధవునిముఖము వివర్ణమాయెను. ఆవివర్ణమునకు ఫలమును నేఁడు గాంచితిని. ఆనాటివృత్తాంతము జ్ఞప్తియందున్నచో మాధవుఁడు నన్నువరింపకుండయుండునేమో? నేఁటి వఱకు నాసంగతి నాకుఁగూడ జ్ఞప్తియందులేదు. మాధవునకు మున్నేయుండదు. మాధవుని హృదయము- ఆశయములు- కృత్యములు నెంతపవిత్రములైనవో జిహ్వయంత స్వచ్ఛతరమైనది. అతని నోటినుండి వెలువడినమాట యసత్యముకాలేదు. అతఁడుచేసినచేత లర్థశూన్యములుగావు. అతఁడు చూసినభావములభావములుగావు. తానుద్వితీయనౌకాయానమునకరుగు

నపుడు రోగగ్రస్తుఁడగు నాచిన్నికుమారునిగాంచి శాశ్వత సౌఖ్యమంద గలడని పల్కెను. ఆతనిమాట యర్థవంతమగుటకు నన్నుదుర్బల గర్భ శోకము పాలుగావించి శాశ్వత సౌఖ్యమునందుటకై స్వర్గలోకమునకే పోయెను. అచటనే యాతఁడు శాశ్వత సౌఖ్యమునందఁగలఁడు. ఈజీవ లోకమునఁ బ్రాణికి సౌఖ్యముశూన్యము. మఱియు కమలా! నీవునన్ను గాంచకపోయినను నిన్నుమాత్రము తప్పకకాంతునని పల్కెను. నీ ప్రియ సంభాషణముల నాలింతునని వచించెను. ఈరెండును యథార్థములైనవి. నన్నాతఁడు దూరమునుండి కాంచెను. నా సంభాషణముల నాలించెను. అపవిత్రురాలనగు నేనుమాత్ర మతనిని దర్శించుటకు నోచుకొనలేకపోయితిని. తన మృతకళేబరమును జూచుటకైన నాతఁ డంగీకరింపలేదు ఇంతియగాక "సర్వేశ్వరా! నాకేమైన విపత్తును రానిమ్ము. నా దారాపుత్రాదుల క్షేమముగనారయు"మని వచించెను. ఆమాటలకు దార్కాణముగా దామోదరునింట సుఖించుచున్న మమ్ములనుగాంచి–మాసౌఖ్యమునకు విఘ్నమొనరింపఁజాలకఁ దాను విపత్తునే పొందెను కేవలము విపన్మాత్రమేకాదు. మరణమునుగూడపొందెను దుర్భరకష్టములందైనను ప్రాణావసాన సమయమందైనను కమలా సౌఖ్యమే యాయుదారాశయుని యభిమతము. నా శ్రేయోభిలాషి యగు నాతనియందుమాత్రము నాకేమియు నాదరములేదు. ఆతనికి నే నేమియు సానుభూతినిఁ గనఁబఱచలేదు. నాయందే ప్రాణములనుంచి నన్నెప్పటికైన దర్శింతునని తలంచి యరుదెంచిన హృదయనాథుని ఆతని స్మరణకుఁ బ్రత్యుపకారముగా విస్మరించితిని.

నా యీఘోరమునకు నిష్కృతిలేదు. నేను మాధవుని యుదంతమును బూర్తిగానరయక పునర్వివాహము నాచరించుకొనుట దోషమే. నాకుఁదెలియకుండ నాతఁడు దివ్యకాంతలనడుమ హంసతూలికా తల్పముల శయనించుచు సుఖించుచున్నను–దురంతకష్టములకు లోనై

బాధనందుచున్నను- సంసారబంధముల విడనాడి మరణించినను- నాకంత కష్టములేదు- నా సౌఖ్యమునకు భంగములేదు. అట్లుగాక నాయందలి మమకారముతో నా సౌఖ్యమునకు భంగము కలిగింపక నా సౌఖ్యముకొఱకు నాత్మార్పణ మాచరించిన యాతని కేవిధముగఁ బ్రత్యుపకార మాచరింపఁగలను? ఆతని యాత్మకు శాంతినెట్లొనఁ గూర్పఁగలను? నాకొఱకుఁ గనువేసరుంది కేవలము నా దర్శనాభిలాషియై యరుదెంచి మరణించిన యావ్యక్తిని నేను జూడకున్నంత మాత్రమున నాతని యాత్మకు శాంతికలుగదు. నేను సంతసముతో నాతని చెంతకేగి యాతని ప్రవాసజనిత దుఃఖముసమూలముగ నశించునట్లు పరిచర్య నాచరించిన నుత్తమలోకమందు నాతోడఁగూడిన యాతనియాత్మ శాంతించును. తప్పక శాంతింపఁగలదు. అదియే నా కర్తవ్యము:—నా నిశ్చయము.

నేనిప్పుడు స్త్రీ పునర్వివాహము తగదని చెప్పుటలేదు. నేను పునర్వివాహ మాచరించుకొనుట వలన నా దోషమేమియు లేదు. మాధవుఁడిఁక రాఁడేమో—సంసారముఁనీదుట దుర్భరమనియెంచియుఁ దిఱిగి వివాహ మాచరించుకొనుట శాస్త్రదూష్యము కాదనియు దలంచి చేసితిని. నే నితరములగు దుర్వ్యాపారములకు లోను గాక నా శీలసంరక్షణార్థము దామోదరుని వివాహమాడితిని. మాధవుని స్థానమున నాతని నెలకొల్పితిని. ఆతనితో సౌఖ్యమందుచుంటిని. మాధవుఁడరుదెంచి నా సౌఖ్యమునకు విఘ్నమొనరింపఁజాలక యాత్మార్పణమాచరించెను. దానికిఁ బ్రత్యుపకారము మఱి నా యాత్మార్పణ గావించుటయే. మరణించినను- సుఖించుచున్నను- బాధపడుచున్నను- మాధవుఁడు నన్ను మఱువఁడు. త్వరలో నాతనిఁగలసికొని భూలోకమందాచరించిన తప్పులనుఁ క్షమించి కాపాడుమని వేఁడెదను. నేనిఁక దామోదరుని

దర్శింపను, మాట్లాడను, నాస్థానమున మఱి యొకతెను బ్రవేశపెట్టి కృతకృత్యుఁడగుఁ గాక.సంతానమునకు సౌఖ్యము కలుగునా?కలుగదా? యను విచారము నా కక్కఱలేదు. వారి మూలముననే నేను దామోదరుని వివాహమాడవలసి వచ్చినది. లేనిచో నా నాఁడే గౌతమీనది యందుఁబడి మరణించియుందును. అప్పుడెట్లో దామోదరుని యింటనే భుజించుచుందురు. కాలక్షేపమగును. నన్ను నిందించిన నిందింతురు గాక నేనీ లోకమున నుండఁజాల. నేను త్వరలోనే మాధవునిఁగలసికొని యాతని యాత్మకు శాంతినొసంగి, నా యాత్మను శాంతినందించెద. ఇంతకంటెఁ బ్రస్తుతసమయమునఁ బట్టి వేఱు కర్తవ్యము స్ఫురించుట లేదు.

ఇంతవఱకు నొక విజనప్రదేశమునఁ గూర్చుండి యాలోచించుచుండిన కమలకుఁ గర్తవ్యము స్ఫురించుట తోడనే దిగ్గునలేచి పావన గౌతమీస్రవంతినీ తీరమునకరిగెను. పూర్వము తానును మాధవుఁడును గలసి తమ యభిప్రాయమును వ్యక్తీకరించుకొని, గాఢాలింగనాదులఁ దనిసిన ప్రదేశములను, బాల్యమునఁ దామువుర్వురును గలసి సంచరించిన సైకతములను గాంచి, యామె యొకసారి యున్నురని, నిట్టూర్పును బుచ్చెను. పిల్లలను గురించి పలువిధముల స్మరించి, వారు సుఖముగా నుండవలయునని పరమేశ్వరునిఁ బ్రార్థించి పూతమగు గౌతమి చెంతకేగి నమస్కరించి అమ్మా! గోదావరీ, చిన్ననాఁటి నుండియు నీవు నన్నెఱుంగుదువు. నా యభిప్రాయములను స్వభావమును, శీలమునుగూడ నెఱుంగుదువు. నేను మొట్టమొదట మాధవుని వరించి యాతఁడు దూరదేశమునకుఁబోవ, అతని జాడయే తెలియకుండుటవలన సంతానమును సాకుట కష్టముగా నుండుటఁ బునర్వివాహమవసరమైనది. అదియుఁగాక దామోదరుఁడు నాకుఁ జిన్నప్పటి

నుండియు మిత్రుఁడు. విశేషించి నన్ను వలచినవాఁడు, నాకొఱకే నైష్ఠిక బ్రహ్మచర్యము నవలంభించెను. కావున నట్టి సుగుణాలవాలుని వివాహము చేసికొని సుఖముగనుంటిని. మాధవుఁడు రాఁడను నూహా దృఢముగ నుండుటచేత నట్లుచేసితిని గాని, యాతఁడు వచ్చునని యేమాత్రము హృదయమునకుఁ దట్టినను దామోదరుని వరింపక మాధవుని కొఱకే దినముల లెక్కపెట్టుచు వేచియుండెడిదానను. నా యభిప్రాయమునకు వేఱుగా జరిగినది. మాధవుఁడరుదెంచినాఁడు. తన యునికి నా సౌఖ్యమునకు భంగమని యెంచి యాత్మార్పణ మాచరించి నాఁడు. ఆకృత్యమే విషమమైనది. నా సౌఖ్యమునకై యాతఁడు మరణించుటవలన నాతని దర్శించుటకైనను నేను మరణింపవలసి యున్నది. తల్లీ! నా పాంచభౌతిక శరీరమును నీయందు లీనమొనర్చుకొని నా యాత్మ మాధవునిఁ జెందునట్లు వరమొసంగుము.

అని, సింధుప్రాణములతో నున్న యా కమల భర్తృ దర్శన లాలసాత్మయై తన శరీరమును గౌతమికర్పించెను. ఆమె పడుటతోడనే గౌతమియు మార్గమునొసంగి తనయందు లీనమొనర్చుకొనెను. కమల మరణింపుచు నొకటి రెండు పర్యాయములు పైకిఁదేలెను గాని, తరువాత నేమైనదో తెలియదు. నాఁటినుండి నేఁటివఱకుఁ గమలాశవమైనను గానరాలేదు. ఆ చర్యనుమాత్ర మొకవ్యక్తి దూరమునుండి కాంచెను.

ఆహా! కమలయెంత యుదారాశయురాలు తన సౌఖ్యమునకై ప్రాణము లర్పించిన హృదయాధినాథుని మాధవునిఁ గలసికొనుటకెంత యాతురత పడినది! ఆమె యుద్వేగమునకంతములేదు. అవ్వ మాధవుని శవమును జూడవచ్చినదో? కమల మరణింప కుండునేమో? అవ్వ మాత్రము దరిఁజేరనీయలేదు. కమలమరణించినది. మానవులందఱువారి యిష్టముల ననుసరించి లోకవృత్తమును గమనింపక, పలువిధముల మా

ట్లాడు నీలోకమందు సౌఖ్యములేదని, మాధవుఁగలసికొన్న చోనచ్చట నేసుఖమున్నదనియు నెంచి, తనసంతానమును దామోదరుఁడు పోషింప గలఁడను మనసుస్థైర్యముతో నితరములగుఁ జింతలనుడిగి యాగోదావరియందుపడి మరణింపఁగల్గెను. అట్టి చిత్తనిశ్చలత యాదంపతులకే చెల్లినదికాని యితరులకుఁజెల్లదు.

నిస్పృహ.

మాధవుని దహనసంస్కారాది క్రియాకలాప మంతయు యథా శాస్త్రముగ ముగియగనే దామోదరుఁడు చింతాకులిత స్వాంతుఁడై హృదయవిదారకరమగు మాధవుని మరణమువలన నత్యధికమగు వేదన ననుభవింపుచు విచారముతోనున్న కమల నోదార్చుటకై యింటికి వచ్చెను. కమల యెచ్చట నున్నదో వెదుక నారంభించెను. కాని యామె మాత్రము కనబడలేదు. ఆరామమును, సౌధోపరిభాగమును గృహమందలి గదులను సవిమర్శముగఁ బరికించెను. అంతయు శూన్యము. గృహమందు పూర్వశోభ యేమాత్రము గానవచ్చుట లేదు. కమలా! కమలా! అని బిగ్గరగఁ గేకవేసి పిలచెను. అతనికి పిలుపునకు ప్రతిశబ్దమే యరుదెంచెనుగాని సమాధానము రాలేదు. అతని శరీరమందుఁ బ్రాణములు లేవు. అవ్వ యింటికడ నుందునేమో యని తలంచి యచ్చటికిఁ కబురంప పెద్దపిల్ల లిరువురుదవ్వ కమల యచ్చట లేదనియు, ఇంతకు ముందరుదెంచి యెచటికో నరిగెననియు సమాధానము వచ్చెను, తల్లి కొఱకు నేడ్చుచున్నపిల్లవానిని సమాధానపరుపలేకఁ దానుఁగూడ నేడ్చుచు దాసి యచటకు వచ్చి బాబుగారూ! అమ్మగారు కనపడలేదు. అబ్బాయిగా రేడ్చుచున్నా రని చెప్పెను. దామోదరున కేమియుఁ దోచుటలేదు. ఏడ్చుచున్న పిల్లవానిని యెత్తుకొని యవ్వయింటియొద్దనున్న యాయిరువురను అవ్వనుగూడఁ దీసికొనిరమ్మని యామెను పంపెను. ఆమాట వినినంతనే యాదాసి యట నిలువకఁ ద్వరితముగ నవ్వయింటికిఁ బోయెను.

యాతనాస్వరూపమగు నీ జీవలోకమును విడచుటవలన మాధవుఁ డదృష్టవంతుఁడు. ఆతని యుదారాశయములు, పవిత్రత, ప్రేమ, నిరాడంబరజీవనము ప్రశంసనీయములు. స్వార్థత్యాగియనిన నాతఁడేగాని యితరులు గారు. పవిత్రమగు ప్రేమకొఱకై దన ప్రాణముల నర్పించిన మహాత్యాగి. ఆతని భార్యయగుఁ గమలను మోసగించి మరణించెనను దురపవాదమును జనింపఁజేసి నామెపై ప్రేమ కలుగునట్లు ప్రవర్తించి యామెను వివాహమాడితిని. నేను వివాహ మాడుటవలననే కమలకు సౌఖ్యము చేకూరినది. కమలసౌఖ్యమును నశింపఁ జేయఁజాలకఁ దన ప్రాణముల నర్పించెను. ఎంత యుదారత! ఆతని యాత్మకు శాంతి కలుగుగాక.

“కమల యేమైనది, మాధవుఁడు మరణించె ననుదుర్వార్త వినుటవలన సంతసించి నాహృదయమును కనుగొనుట కింద్రైన దాగి యుండలేదు గదా? కమల యట్టిది గాదు. మాధవుని మరణవృత్తాంతమును విన్నతోడనే యశ్రువ్యాపృతవదనయై యాతని మృతకళేబరము నైనను దర్శించుటకు వచ్చుచుండి నపుడు- ఆయవ్వ యాదేశము ననుసరించి శవమును గొంపోయితిమి గదా? పిమ్మట యెచ్చటకుఁ బోయియుండును? జీవితము చేదయినదనియు, ప్రాణధారకి సౌఖ్యము లేదనియుఁ దలంచి యీ సంసారమును రోసి ప్రాణపరిత్యాగ మాచరించి యుండదు. ఎందుకాచరింపదు? తన హృదయాధినాథుడు తన సౌఖ్యమునకై యసువుల నర్పింప నతని హృదయశాంతి కొఱకైఁ దన యసువులనుఁ గూడ నర్పించి యుత్తరలోకమున నాతనితో సౌఖ్యమందకుండునా? ఏమో! విధివిధాన మెట్లుండునో? కమలయే యట్టి కృత్యమాచరించిన యీ నిర్భాగ్యుల గతి యేమి? ఈపిల్లలను మువ్వురను నే నెట్లు సాకఁగలను, మాతృదుఃఖము నెట్లు మరపింపఁగలను” అని యాలోచించుచున్న సమయమున నొక వ్యక్తి యరుదెంచి తాను

చూచిన సంగతిని దామోదరున కెఱింగించెను. ఆ! నిజమేనా? అనుకున్న పనియంతయుఁ గడదేరినదా? అని పురుషుఁడైనను, ధీరోదాత్తుఁడైనను, ఆ నిర్భాగ్యురాలను దలచుకొని కంటివెంట నీరును కార్చెను. దీర్ఘము, ఉష్ణమునగు నిశ్వాసమును వెలిబుచ్చెను. ఒడిలోనున్న పిల్లవాని వంక తీక్షణముగఁ జూచినాయనా! మీయమ్మ గతించినది. నిన్ను మాతృవిహీనునిగ నొనర్చినది. వారలకేమి? వారలకు జ్ఞాన మలవడినది వసినుంగువగు నీకేమాతృవియోగము అని స్త్రీవలె వాపోవఁ దొడంగెను.

ఈ వృత్తాంత మంతకుమున్నే తెలియుటవలన విచారించుచు నాయవ్వ పిల్లలతో నరుదెంచి నాయనా! విచారింపకుము. ఆమెకు భూమిపై నూకలు లేవు. ఇంత భాగ్యవంతురాలయినను గోదావరిలో పడి మరణించుట విధివిధానము. ఈపిల్లలను జూచికొని జాగ్రత్తగా నుండుము. నీకు మనశ్శాంతి చేకూరువఱకు నేను మీయింటనె యుండెద అడుదానివలె విచారించెద వేల? నీవుకూడ విచారించినచో యీపిల్లలు గూడ నధికముగ నేడ్తురు. అని యూరడింపఁబూనెను. ఈచర్య నంతయుఁ గాంచుచున్న నాపిల్లలిరువురు చిత్రప్రతిమలవలె నేమియుఁదోపక నిలువఁబడియుండిరి. గోరుచుట్టుపై రోకటిపోటన్నట్లు పితృమరణము వెనువెంటనే మాతృమరణము గూడ సంభవించినది.

అవ్వా! నేను మానవుఁడను గాను. నా కొఱకిరువురు తమ ప్రాణములఁ గోల్పోయిరి. మానవత్వము నాయందు లేదు. కమలా మాధవుల మరణమునకు నేనే కారణభూతుఁడను. నామూలమున వారనువులం బాయుటవలన నాకు మనశ్శాంతి యెట్లుకలుగును? నేను,గూడ నాత్మహత్య గావించుకొని మరణించి వారివ్యసన బ్రహ్మచారి నయ్యెద.

ఆత్మార్పణ.

నాయనా! ఏమనుచున్నావు, మరణించుటయా. మరణించుట యన్న తెలిక యనుకొంటివా? అందునను ఆత్మహత్య గావించు కొందువా? ఏల? ఆత్మహత్య మహాపాతకము గదా? కమలా మాధవు లెందుకొఱకో యాలోచింపకుండ నట్లొనరించిరి గాని నీవుకూడ నట్టి యకృత్యమే చేసిన లోకము గర్హింపదా? నీవలన తప్పే మున్నది? కమలను నీవు ప్రేమించితివి. ఆమె నిన్ను వలచినది. మాధవునివార్త తెలియ లేదు. అట్టి సమయమున నామెను వివాహ మాడితివి. ఇందువలన నీ కేవిధమగు నఘముగూడ రాదు. మరణవ్యవసాయము నుండి మరలి, మరల నొక కన్యను వివాహమాడి యీ సంతానమును జాగ్రత్తగాఁ గాపాడుచుండుము.

అమ్మా! ఈజన్మలో నిఁక వివాహమను మాటనుఁగూడ స్మరింపను. కమల నన్నంగీకరించినదిగాన నీకొద్దివత్సరములైనను గార్హస్థ్యగమవలంబించితిగాని లేనిచో జీవితాంతమువఱకు బ్రహ్మచర్య ముతోడనే యుండవలయునని సంకల్పించితిని. కావున వివాహమాచ రించుకొని నాశరీరము నపవిత్రము చేసికొనజాలను. ఈయిరువురపిల్ల లను నాకుమారునికంటె యధికముగ సంరక్షించెద. వారి మాతా పితలను సంహరించిన ఘోరరాక్షసుడను నేనే. అని యాపిల్లల నిరువుర దనయొద్దకుఁ దీసికొని తాను కన్నీటిని విడచెను. పిమ్మట నెద్దానినో యాలోచించుకొని యవ్వలోఁ బలికెను.

అవ్వా! నా కింకధనమందుఁగాని భోగములందుఁగాని నైశ్వర్య మునందుఁగాని యించుకంతయు నభిలాష లేదు. అనుభవింపవలసినవి యింతకుమున్నె యనుభవించితిని. నాకు జీవితమందుఁగూడ నాశ లేక పోయినప్పటికి నాత్మహత్య మహాపాతక మని నీవుచెప్పుటవలన నా ప్రయత్నమునుండి మరలెద.

ఈపిల్లలిరువురు కమలకు మాధవునివలన జన్మించినను నేఁటివఱకు నన్నే తండ్రిగా భావించు చున్నారు. వారియందుఁగూడ నాకు మిక్కుటమగు వాత్సల్యముకలదు. తమతండ్రియుఁ దల్లియు మరణించుటకు నేనే కారణభూతుఁడ నని తెలిసికొనిన వారలదుఃఖమునకుఁ బారముండదు. అదియునుగాఁక మాతాపితృశూన్యులగు నాబాలికా బాలకుల నాదరించువారెవ్వరు? పోషించువారెవ్వరు? ఈపిల్లవాఁడు నావంశోద్ధవుఁడు. ఈపిల్లలు మువ్వురు సహోదరులౌటవలన నాధిక్యము, అల్పత్వమునను భేదములను బొందక సమానముగానే యుండుట నాకోరిక. కావున నాయాస్తినంతయు నీమగపిల్లల కిరువురకు సమానముగాఁ జెందుటకును నీమెకు నొకవిద్యాధికుఁడు, సాంప్రదాయముగలవాఁడు, భాగ్యవంతుడు నగు వరునకిచ్చుటకు వలయునంత ద్రవ్యమును ఖర్చుపెట్టవలయుననియు, వివాహానంతరము 10 వేల రూప్యముల విలువఁజేయు భూమి యామెకుఁ జెందఁగలందులకును మరణశాసనము వ్రాయుచున్నాను. నీజీవితకాలమంతయు నిచ్చటనేయుండి యీ నొకరౌలుంగని పిల్లలను సాఁకవలయునని ప్రార్థించుచున్నాను. ఈనాప్రయత్నమునకు నీవు మాఱువలుకకుము. నేఁటినుండి నే నీగ్రామమున నుండను.

నేను కాశీ మొదలగుఁ దీర్థయాత్రల కరిగెద, ఆతీర్థయాత్రల యందునాకుఁ దోఁచినంత దానధర్మములాచరించుకొని నాపాపమునకుఁ బరిహారము జేసికొని యుత్తమలోకములకు మార్గమునుఁ గాంచెద. పరోపకారార్థము దేశసేవనుగావించుచు నాశేషజీవితమును ధన్యము జేసికొనెద. నిర్భాగ్యులగుఁ గమలా మాధవుల దలంచి వారియాత్మశాంతికై తగుసత్కర్మల నాచరించెద. అనుభవముగల నీకుఁ బిల్లల గుఱించియు, వారిఁ బెంచుటయందుఁగలుగుఁ గష్టనష్టములనుగుఱించియు నేఁజెప్పుట యనవసరమని పలుకకుండ నవ్వ. నాయనా! నీవు తీర్థ

యాత్రిల కరుగనేల? ఇచ్చటనేయుండుమని బ్రతిమలాడెను. అవ్వా! ఈగ్రామందేయున్నచో నాప్రాణికి సౌఖ్యముండదు. అనుక్షణము కమలానంస్కరణమేతక్క నితరముండదు. సంసారవ్యామోహమును వదలించుకొని మమకారమునువీడి నిష్కాముండై సత్కర్మల నాచరించినఁగాని యుత్తమలోకములు లభింపవు. నేనింక సంసారములఁ దగుల్కొనియుండను. నామనస్సు భోగములనాశించుటలేదని పలికి కమలను స్మరించి యుష్ణనిశ్వాసములు వదలి యొడియందు గూరుచుండిన పిల్లవానిని యవ్వచేతికొసంగి చుటనుండి యేదియో పనిమీఁద వెడలి పోయెను. అవ్వ యాపిల్లలనుఁ దీసికొని యింటిలోనికిఁబోవుచు సర్వేశ్వరుని చేఁతల కాశ్చర్యమునొందుచు నొక్కపర్యాయము కన్నుల వెంబడిని నీరుగార్చెను. పిల్ల లీ కృత్యమునుగాంచుచు వినుచుఁ జిత్రప్రతిమలవలె నిలుచుండి యుండిరి.

స్వస్తి.

దామోదరుఁడట్లు తన యభిప్రాయమునను వ్యవహారములు నన్ని
టిని సక్రమముగఁ బరిష్కరించి తన యాస్తినంతయుఁ బిల్లలపేర వ్రాసి
యన్నను సంరక్షకురాలిగ నియమించి తనకు వలయు ద్రవ్యమును సేక
రించుకొని, బీదల కన్యదానాదికమాచరించి శుభముహూర్తమునఁ
గాశికిఁ బైనమైపోయెను. ఆతని యాత్మవిశ్వాసమునకుఁ జిత్తనిశ్చలతకు
ధార్మికబుద్ధికి గ్రామవాసులందఱుసంతసించిరి. అట్టి యుదారపురుషుఁడు
తమ గ్రామమందుండక యేగుచున్నందులకు విచారించిరి. త్వరలోనే
దర్శనమిప్పింపుమని బ్రతిమలాడిరి. ఆతఁడును ధైర్యముతోఁగాశీప్రయా
ణమును ముగించి త్వరలోవత్తుననిపలికెను. వెళ్ళినప్పుడు పలుమాఱులు
సంతానక్షేమమునరయుటకుఁ జాలమందిని నియోగించెను. ఆతనిపుత్రిక
నాన్నగారూ! మాతలిదండ్రులులేకపోయినను మిమ్ములనే యట్లుభావిం
చుకొందుమనిన మీరుగూడ వదలి మమ్ము చింతాసాగరమునముంచి
యేగెదరా? చంటితమ్మునకు సమాధాన మేమిచెప్పఁగలను? అనివిచారిం
పఁబోవ నమ్మా! విచారింపకుము. కాశీప్రయాణమును ముగించి యరు
దెంతును. నీతమ్ములను జాగ్రతగాఁ జూచుచుఁ దల్లికొఱఁతగాని నాకొఱ
తఁగాని బెంగఁగొననీయకుము. గృహకృత్యములయందు శ్రద్ధనుబూని
యవ్వకు సాయమాచరించుచు మీయమ్మమంచితనమును నిలఁబెట్టుము.
అని హెచ్చరించి యాతఁడు గృహమును వదలిపోయెను. ఆతఁడు దృష్టిప
థముదాటువఱకు నాపిల్లలుముగ్గురు వెలవెలఁబోవుచుదిలకింపసాగిరి.

ఆ ప్రశాంత సాయంసమయమువలన సుప్రసన్నత్వమును,
పావన గౌతమీస్రవంతినీ వీచికా కలరవమువలన కలరవత్వమును. నల
వఱచుకొని యొక బాలికయునిరువురు బాలురు గోదావరీ సైకతస్థలమున
నాటపాటలఁ గాలము బుచ్చుచుండిరి. అందు బాలిక పదునాఱువత్సరము

ల ప్రాయముగలది. బాలకులిరువురు నామెకంటెఁ దక్కువవయస్సువారు.

అక్కా! బొమ్మలపెండ్లిం డ్లాడుకొందమా?

అయ్యో! అవ్వచూచిన మనలను దప్పకదండించును. కావున నాయాటమాత్రము మాని యితరమైనదాని నాడుకొందము.

అక్కా! అవ్వ మనకేమగునే? అని చంటితమ్ముఁడామెను ప్రశ్నింపఁ గద్గదస్వరమును సరిచేసికొని వెర్రినాయనా? అవ్వయనఁగా దల్లికాదటోయి? ఇంతమాత్రం తెలియకపోతే నువ్వేమిచదువుచున్నావు?

అక్కా రాముఁడికి, వాళ్ళనాయన మంచి మంచి వస్తువులు తెచ్చి వాఁడికిస్తాఁడు. మన నాన్న మనకు గనిపించఁడేమే? ఎక్కడున్నాఁడు.

చంటిపిల్లవాని తెలియనిమాటలకు సమాధానము చెప్పుట యా పిల్లకుఁజేతకాలేదు. దీర్ఘనిశ్వాసమును వెలిఁబుచ్చియాలోచించుచుండెను

“అమ్మా! బాబయ్యగారు వచ్చారఁట మిమ్ములను వెంటనే తీసికొని రమ్మని అవ్వగారు పంపారు” అని దాసీ పలుకఁగనే నాన్న గారు’ నాన్నగా‘ రనుచు వారు ముగ్వురు నొకరికంటె నొకరు ముందుగాఁ బఱుఁగెత్తుకొని యింటికిఁ బోయిరి.

“అవ్వా! మన సరోజకు మంచి సంబంధం కుదిర్చానమ్మా! వారు జమీందారులు. మన అమ్మాయి అదృష్టమువల్ల అట్లాంటి సంబంధం కుదిరింది. పెళ్ళికొడుకు మాట వేరేచెప్పనక్కఱలేదు. ఉన్నతవిద్య నభ్యసించినవాఁడు స్ఫురద్రూపి” అను మాటలను దామోదరుఁడు వచించుచుండ సిగ్గువలన సరోజని యటనుండి లేచిపోయెను.

“నాన్నగారూ! అయితే బావ యెప్పుడువస్తాఁడేమిటండీ” రేపే వస్తాఁడు, అక్కయ్యను చూడడానికి మాఘమాసంలో పెళ్ళవుతుంది.

నేను పల్లకీలోఁ గూర్చుంటానని చిన్నపిల్లవాఁడు గంతులువేయుచు కేకలు వేయ సాగెను.

స మా ప్త ము.